శనివారం
25-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 271
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రిటైర్మెంట్ వయస్సు తగ్గించాల్సిందే

ఫ్రాన్స్‌లో తీవ్రస్థాయికి ప్రజాందోళన

రిటైర్మెంట్ వయస్సు తగ్గించాల్సిందేనని ఫ్రాన్స్ ప్రజలు తమ ఉద్యమాన్ని తీవ్రస్థాయికి చేర్చారు. పదిలక్షల మందికిపైగా రోడ్లపైకొచ్చి నిరసన తెలిపారు. ఈ క్రమంలో జనవరి నుంచి నిరసనలతో ఫ్రాన్స్ అట్టుడికిపోతోంది. రాజధాని పారిస్ లోనే 1,19,000 మంది కవాతు నిర్వహించారు. నిరసనకారులు రోడ్లను దిగ్బంధించారు. కొన్ని చోట్ల హింస జరిగింది.

2లో

ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తం

మొత్తం అప్పులు రూ.3,72,503 కోట్లు

- 77.54 శాతం పెరిగిన అంతర్గత రుణాలు
- వచ్చే ఏడేళ్లలో రూ.1,29,817 కోట్ల రుణం చెల్లించాలి
- అప్పుల చెల్లింపునకు మళ్లీ అప్పులు
- రూ.6,356 కోట్ల కేంద్ర నిధులు వృథా
- ఏపీ ప్రభుత్వానికి కాగ్ అక్షింతలు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:
రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పనితీరును కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) తీవ్రంగా తప్పుబట్టింది. పరిమితికి మించి అప్పులు చేస్తున్నట్లు విమర్శించింది. ఏ దశలోనూ ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదని ఆక్షేపించింది. ఫలితంగా అప్పులు తీర్చడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు పేర్కొంది. నిధులు సకాలంలో వినియోగించుకోక పోవడం వల్ల వేల కోట్ల కేంద్ర నిధులు మురిగిపోయాయని ప్రభుత్వ తీరును ఎండగట్టింది. వివిధ శాఖల పనితీరులో కనబరుస్తున్న నిర్లక్ష్యం, కొరవడిన పర్యవేక్షణ కారణంగా వందలాది కోట్ల రాబడులు కోల్పోవాల్సి

- మిగతా 2 లో

నలుగురు ఎమ్మెల్యేల సస్పెన్షన్

- వైసీపీ నిర్ణయం
- క్రాస్ ఓటింగ్ వాస్తవం: సజ్జల

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన నలుగురు ఎమ్మెల్యేలపై వైసీపీ వేటు వేసింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో విప్ ఉల్లంఘించినందుకు నలుగురు ఎమ్మెల్యేలను వైసీపీ అధిష్టానం సస్పెండ్ చేసింది. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఈ విషయాన్ని అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం అధికారికంగా వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విప్ ఉల్లంఘించినందుకు, క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకు నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఉండవల్లి శ్రీదేవిపై వేటు వేసినట్లు తెలిపారు. ఈ నలుగురు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు పార్టీ గుర్తించింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైసీపీ తన సంఖ్యాబలం ఆధారంగా ఏడుగురి అభ్యర్థులను బరిలో దించింది. పంచుమర్తి అనురాధను టీడీపీ పోటీలో ఉంచింది. టీడీపీకి వాస్తవబలం 19 మాత్రమే ఉండగా, వైసీపీ నుంచి నలుగురు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటంతో పంచుమర్తి అనురాధ గెలుపొందారు. దీనిపై వైసీపీ అంతర్గత విచారణ చేపట్టి...నలుగురిపై వేటు వేసింది. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పందిస్తూ...తమను సస్పెండ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. పార్టీకి ఇంతకాలం చేసిన సేవలకు తనకు ఇచ్చిన బహుమతి అని మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం పట్ల కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పెద్దలు ఒంటెత్తు పోకడలతో ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన విమర్శించారు.

ఒక్కొక్కరికీ రూ.15 కోట్లు: సజ్జల
తమకు ఉన్న సమాచారం మేరకు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన వారికి టీడీపీ అధినేత చంద్రబాబు భారీగా డబ్బుల ఆశచూపారని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఒక్కొక్కరికీ రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు ఆఫర్ చేశారని తెలిపారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన వారికి టికెట్ ఇస్తామని కూడా టీడీపీ ప్రతిపాదించి ఉంటుందని సజ్జల వివరించారు. వైసీపీ క్రమశిక్షణ కమిటీ నిర్ణయం మేరకు నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఇలాంటి కొనుగోలు వ్యవహారాలు ఏ పార్టీకైనా నష్టమేనన్నారు. విశ్వాసం లేనప్పుడు పార్టీలో ఉంచడం అనవసరమని, అందుకే వారితో తమకు అవసరం లేదని తొలగించామని చెప్పారు.

రాహుల్‌పై అనర్హత వేటు

- ఎన్నికల్లో పోటీకి ఎనిమిదేళ్లు దూరం
- ఎంత మూల్యానికైనా సిద్ధమే

న్యూఢిల్లీ:
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడింది. ఇకపై ఆయన ఎంపీగా కొనసాగలేరు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 'మోదీ' పరువు నష్టం కేసులో రాహుల్‌కు సూరత్ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. ఇది జరిగిన మరుసటి రోజే ఆయన ఎంపీ హోదాను రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 2023, మార్చి 23 నుంచి రాహుల్ గాంధీపై అనర్హత వేటు అమలవుతుందని నోటిఫికేషన్ పేర్కొంది. తాజాగా పరిణామాల క్రమంలో ఆయన ఎన్నికల్లో పోటీకి ఎనిమిదేళ్లు దూరం కానున్నారు. శిక్షపడిన రెండేళ్లతో పాటు మరో ఆరేళ్లు పోటీ చేసే అవకాశం రాహుల్‌కు ఉండదు. అయితే సూరత్ కోర్టు తీర్పుపై రాహుల్.. హైకోర్టును, అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తారని పార్టీ వర్గాల సమాచారం. కాగా ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలుశిక్ష పడిన వ్యక్తి తీర్పు వెలువడిన తేదీ నుంచి రాజ్యాంగ పదవుల్లో ఉండటానికిగానీ ఎన్నికల్లో పోటీ చేయడానికిగానీ వీల్లేదు. ప్రస్తుతం కేరళలోని వాయనాడ్ ఎంపీగా ఉన్న రాహుల్ గురువారం నుంచే అనర్హత అమలులోకి వచ్చింది.

బీజేపీవి కుల రాజకీయాలు

- నిజాలు మాట్లాడినందుకే రాహుల్‌పై వేటు
- ఇది ప్రజాస్వామ్యంలో చీకటిరోజు
- దీనిపై న్యాయంగా- రాజకీయంగా పోరాడతాం: కాంగ్రెస్

న్యూఢిల్లీ:
తమ నాయకుడు రాహుల్‌గాంధీపై అనర్హత వేటును కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. దీనిపై రాజకీయంగానే న్యాయపరంగానే కాదు రాజకీయంగానూ పోరాడతామని తేల్చిచెప్పింది. బీజేపీ కులరాజకీయాలకు తెరతీసిందని విమర్శించింది. లలిత్ మోదీ, నీరవ్ మోదీ వంటి ఆర్థిక నేరగాళ్లను కాపాడేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోందని దుయ్యబట్టింది. ఓబీసీలను దొంగలతో రాహుల్ పోల్చారన్న బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడిన ఈ రోజు భారత ప్రజాస్వామ్యానికి చీకటి రోజని పేర్కొంది. 'జేపీసీ నుంచి మోదీ ప్రభుత్వం తప్పించుకోలేదు. నీరవ్ మోదీ, లలిత్ మోదీ,

- మిగతా 2 లో

ఎంపీల నిర్బంధం అప్రజాస్వామికం

రాహుల్‌పై అనర్హతవేటు సరికాదు: సీపీఐ

న్యూఢిల్లీ:
అనేక సమస్యలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసేందుకు వెళుతున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీలను ఢిల్లీ పోలీసులు నిర్బంధించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండించింది. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి శిక్ష విధించడం, వెంటనే ఆయనను ఎంపీగా అనర్హుడిగా ప్రకటించడాన్ని తప్పుపట్టింది. సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం ఈ మేరకు శుక్రవారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేసింది. సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ సహా ప్రతిపక్ష ఎంపీలను కేంద్ర హోంమంత్రిత్వశాఖ నియంత్రణలో పనిచేస్తున్న ఢిల్లీ పోలీసులు నిర్బంధించడం విచారకరమని సీపీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు ప్రజాస్వామ్య భవిష్యత్తు, అసమ్మతిని వ్యక్తం చేసే స్వేచ్ఛ, రాజ్యాంగ సంస్థల ఉనికి వంటి అనేక ప్రశ్నలను లేవనెత్తుతోందని పేర్కొంది. అదానీ కుంభకోణంపై జేపీసీ వేయాలన్న డిమాండ్‌ను తిరస్కరించడం

ద్వారా బీజేపీ–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం పార్లమెంటును, ప్రజాస్వామ్య విలువలను మంటగలిపిందని విమర్శించింది. దేశంలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం బీజేపీ–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, అందుకోసం అన్ని లౌకిక, ప్రజాస్వామిక శక్తులు, ప్రజలు ఐక్యంగా పోరాటం చేయాలని సీపీఐ పిలుపునిచ్చింది.

విపక్షం నిరసన హోరు 8లో

మోదీని గద్దె దించుదాం

- ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు దేశవ్యాప్తంగా సీపీఐ పాదయాత్రలు
- సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర –విజయవాడ:
కేంద్రంలోని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో భారతదేశం ఏనాడూ చూడనంతగా తిరోగమనంవైపు నెట్టివేయబడిందని, తక్షణమే మోదీని గద్దె దించాల్సిన అవసరం ఏర్పడిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. 'మోదీ హఠావో–దేశ్ బచావో' నినాదంతో ఏప్రిల్ 14వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సుదీర్ఘ పాదయాత్రలకు శ్రీకారం చుడుతున్నట్లు వెల్లడించారు. ఈ పాదయాత్రలను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని, అవసరమైతే గ్రామగ్రామానికి వెళ్లి, మోదీ నియంతృత్వ పాలనపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. రెండు రోజులు జరిగే సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సమావేశాలు రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.రామచంద్రయ్య అధ్యక్షతన శుక్రవారం విజయవాడ నగరంలోని దాసరిభవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ ప్రసంగిస్తూ, మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాడే అతనొక ప్రమాదకరశక్తిగా సీపీఐ గుర్తించిందని, నేడు మోదీ అరాచక పాలన దేశ రాజ్యాంగ మూలాలకే ముప్పును తీసుకువచ్చిందన్నారు. అదానీ అవకతవకలపై దర్యాప్తునకు జేపీసీ వేయాలని 16 ప్రతిపక్ష పార్టీలు చేసిన డిమాండ్‌ను మొండిగా తిరస్కరిస్తున్న మోదీ సర్కారు 12 లక్షల కోట్ల రూపాయల కుంభకోణంపై కుంటిసాకులతో కాలం వెళ్లదీస్తున్నదని వ్యాఖ్యానించారు. దేశంలోనే తొలిసారిగా సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐ వంటి స్వతంత్ర ప్రతిపత్తిగల చట్టబద్ధ సంస్థలను మోదీ తన జేబు సంస్థలుగా మార్చుకొని ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి జైలు శిక్ష, అనర్హత వేటు ఇందుకు తాజా ఉదాహరణ అని చెప్పారు. మతోన్మాద

- మిగతా 2 లో

'పోలవరం'పై 27, 28 తేదీల్లో దీక్షలు

- 45.72 మీటర్లతో పూర్తిగా నిర్మించాలి
- సీపీఐ రాష్ట్ర సమితి తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా, 45.72 మీటర్ల ఎత్తుతోనే పూర్తి స్థాయిలో నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ సీపీఐ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, సమితి ఏకగ్రీవంగా ఆమోదించింది. పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణం 41.15 మీటర్ల ఎత్తు వరకేనంటూ కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ పార్లమెంటులో చేసిన ప్రకటనను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మోదీ తాతా, మిమ్మల్ని తిడుతూ పలక మీద రాశాను, నన్ను అరెస్టు చేయవుకదా!?

కేంద్రం నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా న్యాయ పోరాటం

- సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన 14 ప్రతిపక్ష పార్టీలు
- దర్యాప్తు సంస్థలు దుర్వినియోగమవుతున్నాయని ఆరోపణ

న్యూఢిల్లీ:
దేశంలోని ప్రతిపక్ష పార్టీలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా న్యాయ పోరాటానికి దిగాయి. రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర దర్యాప్తు సంస్థలయిన సీబీఐ, ఈడీని ఏకపక్షంగా ఉపయోగిస్తున్నా రని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని 14 ప్రతిపక్ష పార్టీలు దాఖలు చేసిన పిటి షన్‌ను ఏప్రిల్ 5న విచారణ చేసేందుకు సుప్రీం కోర్టు శుక్రవారం అంగీకరించింది. డీఎంకే, ఆర్‌జేడీ, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ఎన్‌సీపీ, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), జేడీ(యూ), సీపీఐ, సీపీఎం, సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ), నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) వంటి ప్రతిపక్ష పార్టీల తరపున సీనియర్ న్యాయవాది ఎ.ఎం.సింఘ్వీ వాదనలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఈ పిటిషన్‌ను ఏప్రిల్ 5న విచారణకు తీసుకోనున్నట్లు తెలిపింది. 'నేను భవిష్యత్తు కోసం మార్గదర్శకాలను అడుగుతున్నాను. సీబీఐ, ఈడీ రెండూ దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి వ్యతిరేకంగా 14 ప్రతిపక్ష పార్టీల విశేషమైన కలయిక ఇది. సీబీఐ, ఈడీలకు చెందిన తొంభై ఐదు శాతం కేసులు ప్రతిపక్ష నేతల పైనే ఉన్నాయి' అని ప్రతిపక్షాల తరపున హాజరయిన సీనియర్ న్యాయవాది ఎ.ఎం.సింఘ్వీ అన్నారు. '2014కి ముందు, 2014 తర్వాత. ఈ కేసుల్లో భారీ పెరుగుదల చోటుచేసు కుంది. నేరారోపణ రేటు నాలుగు నుంచి ఐదు శాతం. అరెస్టుకు ముందు మార్గదర్శకాలు, అరెస్టు తర్వాత బెయిల్ మార్గదర్శకాలను మేము అడుగుతు న్నాము' అని సింఘ్వీ చెప్పారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీబీఐ, ఈడీ దాఖలు చేసిన కేసుల సంఖ్య పెరగడాన్ని సీనియర్ న్యాయ వాది ప్రస్తావించారు. నాయకులు బీజేపీలో చేరిన తర్వాత వారిపై కేసులు తరచుగా ఎత్తివేయబడతా యని లేదా సమాధి చేయబడతాయని పార్టీలు పేర్కొ న్నట్లు ఒక వార్తా సంస్థ కథనం తెలిపింది. ఇదిలా ఉండగా, సీబీఐ, ఈడీ, ఇతర దర్యాప్తు సంస్థల ద్వారా ప్రభుత్వం తన నేతలను లక్ష్యం చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఢిల్లీ మాజీ ఉప ముఖ్య మంత్రి మనీశ్ సిసోడియా, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్, భారత రాష్ట్ర సమితి నాయకురాలు కె.కవిత, ఆర్జేడీ నాయకుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌తో సహా అనేక మంది నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. ప్రస్తుతం సిసోడియా, జైలులో ఉన్నారు.

రేపు ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్ ప్రయోగం

- ఉదయం 9 గంటలకు కౌంట్ డౌన్ ప్రారంభం
- లియో ఆర్బిటల్ కక్ష్యలోకి 36 ఉపగ్రహాలు
- పూర్తి వాణిజ్య ప్రయోగం

విశాలాంధ్ర–సూళ్లూరుపేట:
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి మరో వాణిజ్య రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం అయింది. ఈనెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్‌ను ప్రయోగించనున్నది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) లోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్ ద్వారా బ్రిటన్‌కి చెందిన 36 ఉపగ్రహాలను ప్రయోగించనున్నారు. వన్ వెబ్

- మిగతా 2 లో

ఎన్‌పీఎస్ మెరుగుకు ప్యానెల్: కేంద్రం

న్యూఢిల్లీ: ఆర్థిక వివేకాన్ని కొనసాగిస్తూనే ఉద్యోగుల ఆందోళనను పరిగణనలోకి తీసుకోవాలనే ఉద్దేశంతో కొత్త పింఛను వ్యవస్థ (ఎన్‌పీఎస్)ను మెరుగుపరచడానికి ఆర్థిక కార్యదర్శి అధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఆర్థిక బిల్లు 2023 లోక్‌సభలో పరిశీలన, ఆమోదం కోసం వెళుతున్నప్పుడు ఎన్‌పీఎస్‌కి కొత్త విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించడానికి రూపకల్పన చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. 'పింఛన్ల సమస్యను పరిశీలించడానికి ఆర్థిక కార్యదర్శి అధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, సాధారణ పౌరులను రక్షించడానికి ఆర్థిక వివేకాన్ని కొనసాగిస్తూ ఉద్యోగుల అవసరాలను పరిష్కరించే విధానాన్ని రూపొందించాలని నేను ప్రతిపాదిస్తున్నాను. ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించడానికి రూపొందించబడతాయి' అని ఆమె చెప్పారు. అనేక బీజేపీయేతర రాష్ట్రాలు డీఏ అనుసంధానిత పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) ని తిరిగి తీసుకురావాలని నిర్ణయించడం, కొన్ని ఇతర రాష్ట్రాల్లోని ఉద్యోగ సంఘాలు కూడా దీని కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. రాజస్థాన్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ స్కీమ్‌కు తిరిగి తీసుకురావాలనే తమ నిర్ణయాన్ని కేంద్రానికి తెలియజేశాయి. అలాగే ఓపీఎస్ కింద పేరుకుపోయిన కార్పస్ నిధిని తిరిగి చెల్లించమని అభ్యర్థించాయి.

రేపు ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్ ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)
ఇండియా-2 మిషన్ ద్వారా కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల ప్రకారం, ఇప్పుడు రెండవ సారి మరో 36 ఉపగ్రహాలను భూమికి సమీప 450 కిలోమీటర్ల దూరంలో గల లియో ఆర్బిటల్ వృత్తాకారపు కక్ష్యలోకి ప్రవేశపెట్టబోతుంది. మొత్తం ఈ ఉపగ్రహాల బరువు 5,805 కిలోల వరకు ఉంటుంది. ఈ రాకెట్ 20 నిమిషాల పాటు అంతరిక్షం వైపు ప్రయాణించిన అనంతరం 36 ఉపగ్రహాలను ఒకదాని తర్వాత ఒకదానిని కక్ష్యలోకి వదులుతుంది. ఎల్‌వీఎం3-ఎం 3 రాకెట్ ఎత్తు 43.5 మీటర్లు, బరువు 643 టన్నుల వరకు ఉంటుంది. గత ఏడాది అక్టోబరు 23న 36 ఉపగ్రహాలను కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టిన ఇస్రో... అదే ఉత్సాహంతో ఈ ప్రయోగ విజయానికి సన్నాహాలు చేస్తోంది. ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించిన కౌంట్ డౌన్ ప్రక్రియ శనివారం ఉదయం 9 గంటలకు మొదలై నిరంతరాయంగా 24 గంటల కౌంట్ డౌన్ పూర్తయిన అనంతరం ఆదివారం ఉదయం 9 గంటలకు ఎస్‌వీఎం3-ఎం 3 రాకెట్ నింగిలోకి దూసుకు వెళ్లనుంది. ఈ ప్రయోగానికి సంబంధించి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్ షార్‌కు చేరుకొని శాస్త్రవేత్తలతో రాకెట్‌లోని అన్ని భాగాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.

'పోలవరం'పై 27, 28 తేదీల్లో దీక్షలు

(మొదటిపేజీ తరువాయి)
రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. మొదటి దశ పేరుతో 45.72 మీటర్ల కాంటూరు నుంచి 41.15 మీటర్లకు ఎత్తు తగ్గించాలనడంతో జాతీయ ప్రాజెక్టు పోలవరం మినీ ప్రాజెక్టుగా మారనుందని, దీనివల్ల ప్రాజెక్టు నీటి నిల్వ 196.60 టీఎంసీల నుంచి 92 టీఎంసీలకే పరిమితం కానుందని వివరించింది. పూర్తిస్థాయిలో ప్రాజెక్టును నిర్మిస్తే... 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుందని తెలిపింది. 80 టీఎంసీల నీటిని గోదావరి నుంచి కృష్ణానదికి తరలించడం, కృష్ణా నీటిని శ్రీశైలం ద్వారా కృష్ణా డెల్టాకు ఇచ్చేనీటిని ఆదా చేసి వాటిని రాయలసీమకు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని వివరించింది. రాయలసీమ ప్రాజెక్టులైన గాలేరు-నగరి, హంద్రీ-నీవా లాంటి ప్రాజెక్టులకు కొంతమేర నికర జలాలు కుడి, ఎడమ కాలువల ద్వారా 534 గ్రామాలకు తాగునీరు, విశాఖపట్నానికి 24 టీఎంసీల నీటిని అందిస్తే విశాఖపట్నం తాగునీటి అవసరాలతోపాటు పారిశ్రామిక అవసరాలు తీరుతాయని తెలిపింది. బాబూ జగ్జీవన్‌రావు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా 8 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని సూచించింది.

సెంట్రల్ వాటర్ కమిషన్‌కు అనుబంధంగా ఉన్న టెక్నికల్ ఎడ్వయిజరీ కమిటీ అంచనా వ్యయం రూ.55,548 కోట్లకు ఆమోదించి కేంద్రం ఆర్థిక శాఖకు పంపిందని గుర్తుచేసింది. కేంద్రంలోని జలశక్తి శాఖ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ డీపీఆర్-2ను రూ.47,724 కోట్లకు ఆమోదించాలని కేంద్ర ఆర్థిక శాఖ సూచించింది. ఆర్థిక శాఖ (15-03-2017) న కేంద్ర కేబినెట్‌లో చర్చించిన అనంతరం రూ.20 వేల కోట్లకే ఆమోదిస్తున్నట్లు ప్రకటించిందని వివరించింది. ప్రస్తుత పార్లమెంటులో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి చేసిన ప్రకటనతో ఇరిగేషన్ రంగ నిపుణులు, రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారని, సహాయ పునరావాస కార్యక్రమాలకూ జాప్యం జరిగే అవకాశముందని, రెండో దశ ప్రస్తావన లేకపోవటం ఇందులో గమనించదగ్గ అంశమని వివరించింది.

రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించేలా పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలనే కేంద్ర ప్రభుత్వ కుట్రను సీపీఐ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. 45.72 మీటర్ల ఎత్తుతోనే ప్రాజెక్టు నిర్మించాలని, నిర్వాసితులకు అవసరమైన పునరావాసం, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం మొదటి దశ, మలి దశ అనే మెలికపెట్టకుండా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, తక్షణమే సీఎం జగన్ చొరవ తీసుకుని అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఈ సమస్యపై ఈ నెల 27, 28 తేదీల్లో అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద సామూహిక దీక్షలు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి పిలుపునిస్తూ తీర్మానించింది.

బీజేపీవి కుల రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)
మేహుల్ చోక్సీ ఆర్థిక నేరగాళ్లు, పీఎన్‌బీ, ప్రజల డబ్బును దోచుకుపోయారు. ఓబీసీలు అలా చేయలేదు. అలాంటప్పుడు రాహుల్ వ్యాఖ్యలు వారిని అవమానించినట్లు ఎలా అవుతాయి? అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే వెల్లడించారు. నిజాలు మాట్లాడుతున్నందున రాహుల్‌పై అనర్హత వేటు పడిందని ఆయనన్నారు. 'ఆయనపై అనర్హత వేటు కోసం బీజేపీ చేయగలిగినదంతా చేసింది. నిజం మాట్లాడినందుకు, రాజ్యాంగం, ప్రజల హక్కుల కోసం పోరాడినందుకు ఆయనను సభ నుంచి తొలగిం చారు' అని ఖడ్గే అన్నారు. 'ఇదేమీ వెనకబడిన వర్గాల వ్యవహారం కాదు. లలిత్ మోదీ, నీరవ్ మోదీ వెనుకబడిన వర్గాలకు చెందిన వారు కాదు. వెనుకబడిన వర్గాలకు వ్యతిరేకంగా రాహుల్ మాట్లాడినట్లు చిత్రీకరించే ప్రయత్నాన్ని చేస్తున్నారు. రాహుల్ వాస్తవాలను ప్రజలు ముందుకు తేవడం వారికి నచ్చలేదు' అని బీజేపీ నేత జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలపై ఖడ్గే స్పందించారు. ఓబీసీ వర్గీయులను దొంగలతో రాహుల్ పోల్చినట్లు నడ్డా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 'జైలుకు వెళ్లాల్సి వచ్చినాగానీ వెనక్కు తగ్గం. ప్రజాస్వామ్య పరిక్షణ కోసం పోరాడతాం. మన ప్రజలు పోరుకు సిద్ధంగా ఉన్నారు' అని అన్నారు. దొంగలకు మద్దతివ్వడమే కాకుండా ఇప్పుడు కులరాజకీయలు చేయడం సిగ్గుచేటని ఖడ్గే వ్యాఖ్యానించారు. రాహుల్‌పై అనర్హత వేటుపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ 'మేమేమీ బెదిరిపోం.. మౌనంగా ఉండిపోం. ప్రధాని అనుబంధ అదానీ మహా మెగా కుంభకోణంపై జేపీసీ విచారణ విషయంలోనూ వెనక్కతగ్గబోం. రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడింది. భారతీయ ప్రజాస్వామ్యానికి ఓం శాంతి' అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందిస్తూ తాజా పరిణామంతో ఖంగుతిన్నట్లు తెలిపారు. ఇటువంటి రాజకీయాలు మన ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచివి కాదని ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి స్పందిస్తూ మోదీ ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపులకు దేశమే ప్రత్యక్ష సాక్షి అన్నారు. భారత్ జోడో యాత్ర క్రమంలో రాహుల్ గాంధీకి ప్రజాదరణ పెరుగుతుండటాన్ని మోదీ ప్రభుత్వం జీర్ణించుకోలేకపో తోందని, ఆయనను తొక్కేయాలని కుట్రలు పన్ని ఇదంతా చేసిందని ఆరోపించారు. పార్లమెంటులో ఆయనను మాట్లాడనిస్తే వీరు ప్రభుత్వంలో కొనసాగలేరని గ్రహించే ఆయనపై అనర్హత వేటు పడేలా చేశారన్నారు. 'ఇది నిరంకుశ ప్రభుత్వమని, ఇలాంటి పరిపాలనలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదు'అని చౌదరి అన్నారు. అదానీ వ్యవహారంలో ప్రధాని మోదీని రాహుల్ ప్రశ్నించడం మొదలు పెట్టిన రోజు నుంచే ఆయన అణచివేతకు బీజేపీ కుతంత్రాలు మొదలయ్యాయని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ అన్నారు. అప్రజాస్వామిక-నియంత పరిపాలన వైఖరికి తాజా చర్య అద్దం పడుతోందన్నారు.

రిటైర్మెంట్ వయస్సు తగ్గించాల్సిందే

- ఫ్రాన్స్‌లో తీవ్రస్థాయికి ప్రజాందోళన
- రోడ్లపైకొచ్చిన పది లక్షల మంది
- 457 మంది అరెస్టు
- 441 మంది భద్రతా సిబ్బందికి గాయాలు
- నిరసనలతో అట్టుడికిన దేశం
- 28న పదోసారి దేశవ్యాప్త నిరసన

పారిస్: రిటైర్మెంట్ వయస్సు తగ్గించాల్సిందేనని ఫ్రాన్స్ ప్రజలు తమ ఉద్యమాన్ని తీవ్రస్థాయికి చేర్చారు. పదిలక్షల మందికిపైగా రోడ్లపైకొచ్చి నిరసన తెలిపారు. ఈ క్రమంలో జనవరి నుంచి నిరసనలతో ఫ్రాన్స్ అట్టుడికిపోతోంది. రాజధాని పారిస్‌లోనే 1,19,000 మంది కవాతు నిర్వహించారు. నిరసనకారులు రోడ్లను దిగ్బంధించారు. కొన్ని చోట్ల హింస జరిగింది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 నుంచి 64 ఏళ్లకు పెంచాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ బిల్లును తీసుకురావడం, దానిని ఓటింగ్ లేకుండా పార్లమెంటు ఆమోదించడంతో కార్మిక-ప్రజా-ఉద్యోగ సంఘాలు నిరసన బాట పట్టాయి. అనేక చోట్ల నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణతో హింసాత్మక వాతావరణం నెలకొంది. 1,19,000 మంది కవాతు నిర్వహించడం పారిస్ చరిత్రలో లేదని దేశ అంతర్గత వ్యవహారాల శాఖ పేర్కొంది. దేశవ్యాప్తంగా పది లక్షల మందికి పైగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపింది. 457 మంది అరెస్టు కాగా 441 మంది భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి గెరాల్డ్ దర్మనిన్ వెల్లడించారు. ఆయన శుక్రవారం ఉదయం ఓ వార్తాఛానల్‌తో మాట్లాడుతూ పారిస్ వీధుల్లో 903 చోట్ల నిరసనకారులు నిప్పు పెట్టారన్నారు. భారీస్థాయిలో ప్రదర్శనలు, ఆందోళనలు జరిగాయని, హింస చోటుచేసుకుందని, పారిస్ మొత్తం అట్టుడికిపోయిందని చెప్పారు. మరోవైపు పోలీసులు అద్భుతంగా పనిచేశారని ప్రశంసించారు. హింస కారణంగా ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని నేను అనుకోవడం లేదు. ప్రజాస్వామిక, సామాజిక చర్చకు అంగీకారం తెలుపాలేగానీ హింసాత్మక చర్చకు కాదు' అని ఆయనన్నారు. పశ్చిమ ఫ్రాన్స్ నగరాలైన నాంటెస్, రెన్నెస్, లోరియంట్లో నిరసనకారులు కదం తొక్కారు. లోరియంట్ సిటీలోని ఓ పరిపాలనా భవనంపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. అక్కడి పోలీస్ స్టేషన్‌ను తగులబెట్టారు.

నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. బాష్పవాయువును ప్రయోగించారు. దేశవ్యాప్తంగా 3.5 మిలియన్ల మందికిపైగా నిరసనల్లో పాల్గొన్నట్లు అతిపెద్ద యూనియన్ 'సీజీటీ' నివేదించింది. పారిస్‌లో 1,20,000 మంది పాల్గొన్నట్లు పోలీసులు తెలుపగా 8,00,000 మంది పాల్గొన్నారని యూనియన్ తెలిపింది. ప్లేస్ డె లా రిపబ్లికా వద్ద నిరసనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయువును పోలీసులు వాడినట్లు ఎ రియా నోవోస్టి ప్రతినిధి వెల్లడించారు. లౌడ్ స్పీకర్ల ద్వారా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని హెచ్చరించారని, జల ఫిరంగులనూ ప్రయోగించారని చెప్పారు. ఈనెల 28వ తేదీన 10వ దేశవ్యాప్త ఆందోళన జరుగుతుందని దేశంలోని కార్మిక సంఘాలు ప్రకటించాయి. ఇదిలావుంటే పోలీసులకు, నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణలను ప్రధాని ఎలిజబెత్ బార్నె ఖండించారు. 'ఇంతటి హింస, విధ్వంసం ఆమోదయోగ్యం కాదు. పోలీసులు, అత్యవసర సేవలు తగు చర్యలు తీసుకున్నందుకు వారికి కృతజ్ఞురాలిని' అని ట్వీట్ చేశారు.

విశాలాంధ్ర ప్రపంచం

'రేడియోయాక్టివ్ సునామీ' డ్రోన్ ప్రయోగించిన ఉ.కొరియా

ప్యాంగ్యాంగ్: అణ్వాయుధాలను సముద్రం లోపల నుంచి మోసుకెళ్లడమే కాకుండా వాటిని పేల్చగల సామర్థ్యమున్న 'హెయిల్' డ్రోన్‌ను ఉత్తర కొరియా ప్రయోగించింది. అణుశక్తి లేకుండా ఆయుధాలను జపాన్ సముద్రంలో పరీక్షించినట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) శుక్రవారం వెల్లడించింది. మంగళవారం రివాన్ కౌంటీ తీరం నుంచి విన్యాసాల్లో భాగంగా ఈ డ్రోన్ ప్రయోగించగా హాంగ్‌వాన్ బే జలాల్లో నిర్దేశిత లక్ష్యాన్ని అది చేరుకోగలిగింది. గురువారం క్షిపణిని పేల్చిందని, పరీక్షలు విజయవంతం అయ్యాయని వార్తాసంస్థ పేర్కొంది. సముద్రంలో 262 నుంచి 492 అడుగుల లోతులో 59గంటల 12 నిమిషాల పాటు ఈ డ్రోన్ ప్రయాణించిందని తెలిపింది. శత్రు నౌకా దళాన్ని నిర్వీర్యం చేసేందుకు సముద్రం లోతుల్లో పేలుడు ద్వారా రేడియోయాక్టివ్ సునామీ సృష్టించేందుకు ఈ ఆయుధం రూపొందిందని వెల్లడించింది. హ్వసల్-1, హ్వసల్-2 వ్యూహాత్మక క్రూయిజ్ మిసైళ్లను పరీక్షించినట్లు ప్యాంగ్యాంగ్ ధ్రువీకరించినట్లు కేసీఎన్ఏ నివేదిక తెలిపింది. దక్షిణ కొరియా-అమెరికా సంయుక్త సైనిక విన్యాశాలకు ప్రతిస్పందనగా చేపట్టిన ఈ ఆయుధాల పరీక్షలను ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ పర్యవేక్షించినట్లు వార్తాసంస్థ వెల్లడించింది.

సాంస్కృతికాభివృద్ధిలో యువత భాగస్వామ్యం

ఇప్టా జాతీయ మహాసభలు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జార్ఖండ్‌లోని డెల్టాన్‌గంజ్ పట్టణంలో ఈ నెల 17వ తేదీ నుంచి 19 వరకు నిర్వహించిన ఇప్టా 15వ జాతీయ మహాసభలు విజయవంతంగా ముగిశాయని ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రానాయక్, చిన్నం పెంచలయ్య చెప్పారు. విజయవాడలోని దాసరిభవన్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, జాతీయ మహాసభల తీర్మానాల చర్చల నిర్ణయాలను, నూతన కమిటీ విషయాలను వారు వెల్లడించారు. దేశంలో లౌకిక ప్రగతిశీల భావాలు కలిగిన రచయితలు, కళాకారులపై కొనసాగుతున్న దాడులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని, పాఠ్యపుస్తకాలలో మతపరమైన అంశాలకు తావు లేకుండా శాస్త్రీయ భావజాలం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న పర్యావరణ సమస్య పరిష్కారం కోసం పాలకులు గట్టి చర్యలు తీసుకోవాలని, అందుకోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. సాంస్కృతిక రంగాభివృద్ధి కోసం యువతను భాగస్వాములు చేసి, ఆ రంగాభివృద్ధి కోసం ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశ పెట్టామన్నారు. 125 మంది జాతీయ సమితి సభ్యులతో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నట్లు, ఆంధ్రప్రదేశ్ నుంచి కార్యదర్శులలో ఒకరిగా గని, సమితి సభ్యులుగా చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య, ఆర్.రామకృష్ణ, ఆర్.పిచ్చయ్య, మహంతి లక్ష్మణరావు, ఆరేటి రామారావును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్.పిచ్చయ్య, ఆరేటి రామారావు పాల్గొన్నారు.

ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తం

(మొదటిపేజీ తరువాయి)
వచ్చినట్లు వెల్లడించింది. 2022 మార్చి 31వ తేదీతో ముగిసిన సంవత్సరానికి ఏపీ ఆర్థిక స్థితిగతులపై ఆడిట్ నివేదికను కాగ్ కార్యాలయం సమర్పించింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ మొత్తం అప్పులు రూ.3,72,503 కోట్లుగా పేర్కొంది. ఇందులో 90 శాతం రుణాలు 13.99 శాతం వడ్డీతో తీసుకున్నవే కావడం గమనార్హం. 2018 నుంచి 2022 వరకూ అంతర్గత రుణాలు 77.54 శాతం పెరిగాయి. గడిచిన ఐదేళ్లలో తలసరి రుణం 61 శాతం పెరిగింది, బడ్జెటేతర రుణాలు కలిపితే తలసరి రుణ భారం రూ.92,797గా నమోదైంది. వచ్చే ఏడేళ్లలోగా రాష్ట్ర ప్రభుత్వం రూ.1,29,817 కోట్ల రుణాలు తీర్చాలని కాగ్ తన నివేదికలో వెల్లడించింది. కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చిన 6,356 కోట్ల రూపాయల గ్రాంట్ మురిగిపోయింది. గత ఏడాదితో పోలిస్తే చెల్లించాల్సిన రుణాలు 24,257 కోట్ల రూపాయల మేర పెరిగాయి. బడ్జెటేతర రుణాలు 1,18,394 కోట్ల రూపాయలు నమోదయ్యాయి. డిస్కమ్‌లకు, నీటిపారుదల ప్రాజెక్టులకు చెల్లించాల్సిన బకాయిలు మరో రూ.17,804 కోట్లుగా ఉంది. వీటిని బడ్జెట్‌లో చూపకపోవటంతో కీలకమైన మౌలిక సదుపాయల కల్పనా నిధులపై శాసనసభ నియంత్రణ కోల్పోయేందుకు కారణమైంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఏపీ 18.47 శాతం జీఎస్‌డీపీ వృద్ధి రేటు నమోదు చేసింది. 2021లో ఎఫ్ఆర్బీఎం చట్టాన్ని సవరించి ఆర్థిక రుణ పరిమితి పెంచుకునే ప్రయత్నం చేసినట్లు పేర్కొంది. చెల్లించాల్సిన రుణాలు సవరించిన ఎఫ్ఆర్‌బీఎం చట్టంలో నిర్దేశించిన లక్ష్యాలకు లోబడి ఉన్నట్లు చూపినప్పటికీ...బడ్జెట్‌లో చూపని అదనపు రుణాలను లెక్కలోకి తీసుకుంటే, అవి లక్ష్యాలకంటే అదనంగా ఉన్నాయని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు ఏటా పెరుగుతూనే ఉన్నాయని, ముఖ్యంగా 2021-22 సంవత్సరంలో తీసుకున్న రుణాల్లో ఎక్కువభాగం రెవెన్యూ ఖాతాను భర్తీ చేసేందుకు వినియోగించడం రాష్ట్ర ఆస్తుల కల్పనపై ప్రభావం చూపుతోందని కాగ్ పేర్కొంది. రూ.688 కోట్ల రెవెన్యూ వ్యయాన్ని మూలధన వ్యయమని తప్పుగా వర్గీకరించారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్ఆర్ గృహవసతి పథకాన్ని మూలధన వ్యయంగా ప్రభుత్వం చూపింది. లబ్ధిదారులకు ఇచ్చే ఇళ్లస్థలాలు, ఇళ్లను రెవెన్యూ వ్యయంగా చూపాల్సి ఉంది. బడ్జెట్‌లో చూపని అదనపు రుణాలు పరిమితి కంటే అధికంగా ఉన్నాయి. స్మార్ట్ పట్టణాలు, కృషి వికాస్ యోజన, జాతీయ ఆరోగ్య మిషన్ వంటి పథకాలకు రాష్ట్ర వాటా విడుదల కాకపోవటం వల్ల అవి సరిగ్గా అమలు కాలేదు. రూ.3540 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నా రాష్ట్రం వివిధ పథకాలకు తన వాటా విడుదల చేయలేదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో పెట్టుబడి వ్యయం తక్కువగా ఉంది. ఇది భౌతిక ఆస్తుల కల్పనపై ప్రభావం చూపి దీర్ఘకాల ఆర్థికాభివృద్ధి కుంటుపడే అవకాశముందని కాగ్ స్పష్టంచేసింది. 2021-22 సంవత్సరంలో వ్యక్తిగత డిపాజిట్ ఖాతాలకు సంబంధించి రూ.11,237.61కోట్లకు గాను రూ.1,99,616 సర్దుబాట్లకు సంబంధించిన లావాదేవీలు జరిగాయి. ఆ లావాదేవీలు రాష్ట్ర ఆర్థిక నియమావళి ఉన్న నిబంధనలకు విరుద్ధంగా ట్రెజరీ ద్వారా కాకుండా, కేంద్రీకృత ప్రాసెసింగ్ సెల్ ద్వారా నిర్వహించింది. అంతేగాక వాటిలో అధిక సర్దుబాటు లావాదేవీల్లో సరిపడినన్ని పత్రాలు కనపడలేదు. ఇది ప్రభుత్వ పద్దుల పారదర్శకతను ప్రభావితం చేస్తుందని తెలిపింది. స్థానిక సంస్థలు డిస్కలంకు చెల్లించాల్సిన రూ.1351.47 కోట్ల విద్యుత్ బకాయిలను ఆర్థిక సంఘ గ్రాంట్ల నుంచి మినహాయించింది. ఆ సంస్థల అనుమతి లేకుండా ఆర్థిక సంఘం గ్రాంట్ల నుంచి నిధులను మినహాయించడం స్థానిక సంస్థలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలనే రాజ్యాంగ ఉద్దేశానికి రాష్ట్ర ప్రభుత్వ చర్య పూర్తి విరుద్ధమని కాగ్ తప్పుబట్టింది.

పన్నుల వసూళ్లలో జరిగిన నిర్లక్ష్యం కారణంగా వివిధ రూపాల్లో ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగినట్లు కాగ్ విశ్లేషించింది. ఉదాహరణకు అమరావతి ఏసీ బస్సుల్లో లైవ్ టీవీ వ్యవస్థ అమల్లో తగిన జాగరూకత పాటించడంలో కార్పొరేషన్ విఫలం కావడం వల్ల రూ.2.49 కోట్లు వృథా అయినట్లు వెల్లడించింది. ప్రయాణికుల నుంచి ఏసీ బస్సు చార్జీలకు సంబంధించి జీఎస్టీని సకాలంలో వసూలు చేయడంలో ఏపీఎస్ ఆర్టీసీ విఫలమైందని, ఆన్‌లైన్ టికెట్ అకౌంటింగ్ వ్యవస్థ/కేంద్ర సమాచార వ్యవస్థ షెడ్యూళ్లలో మార్పులు చేయడంలో ఆలస్యం కారణంగా జీఎస్టీని తిరిగి చెల్లించడానికి కేవలం వడ్డీ రూపంలో సంస్థ రూ.3.25 కోట్లు కోల్పోయినట్లు తెలిపింది. వాహనాలకు సంబంధించి తప్పనిసరిగా నిర్వహించాల్సిన వార్షిక సామర్థ్య ధృవీకరణ పరీక్షలను రవాణా శాఖ దాదాపు 1,18,399 వాహనాలకు నిర్వహించలేదు. ఫలితంగా రూ.5.99 కోట్ల ధృవీకరణ రుసుం కోల్పోవాల్సి వచ్చిందని, ఇలా వివిధ కారణాలతో రూ.198.04 కోట్ల రాబడులు కోల్పోవాల్సి వచ్చినట్లు కాగ్ వివరించింది.



మోదీని గద్దె దించుదాం!

(మొదటిపేజీ తరువాయి)
ఎజెండాను అమలు చేస్తూనే దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతూ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేశారని, పైగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశ ప్రజల దృష్టిని మరల్చడానికి జాతీయవాదాన్ని రగుల్కొల్పుతున్నారని విమర్శిం చారు. ఖలిస్థాన్ ఉద్యమం అనుకోకుండా తెరపైకి రావడం ఈ తరహా ప్రయత్నమేనని చెప్పారు. అదానీకి అన్ని పోర్టులను అప్పగించినా అడిగే దిక్కు లేకుండాపోయిందని, ప్రజల గొంతు కనునొక్కి, నియంతృత్వ పాలనను సాగిస్తున్న బీజేపీని తరిమి కొట్టడం అనివార్యమని నారాయణ అన్నారు. దేశాన్ని కాపాడుకోవడానికి, లౌకిక, ప్రజాతంత్ర వ్యవస్థలను పరిరక్షించుకోవడానికి సీపీఐ ముందుండి పోరాటాలు చేస్తుందని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా భావ సారూప్యత గల పార్టీలతో ప్రత్యామ్నాయం ఏర్పాటు దిశగా కృషి జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యకలాపాలపై నివేదిక సమర్పించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి అనూహ్యమైన పరాజయాలు ఎదురుకావడం జగన్ ప్రభుత్వం పట్ల పెరుగుతున్న వ్యతిరేకతకు పక్కా సంకేతంగా అభి వర్ణించారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ, ఏఐకెఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య వేదికపై ఆశీనులయ్యారు.

బీజేపీ, వైసీపీ దొందూదొందే: నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అటు కేంద్రంలో బీజేపీ, ఇటు రాష్ట్రంలో వైసీపీ దొందూదొందే అన్నట్లుగా ప్రవర్తిస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. శుక్రవారం నారాయణ ఒక ప్రకటన విడుదల చేస్తూ రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత నిర్ణయం తీసుకోగా, ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయలేదనే సాకుతో ఎలాంటి ఆధారాలు లేకపోయినా నలుగురు తన పార్టీ ఎమ్మెల్యేలను వైసీపీ సస్పెండ్ చేసిందన్నారు. రహస్య బ్యాలెట్ ద్వారా జరిగిన పోలింగ్‌లో ఏ విధంగా వైసీపీ తమకు ఓటు వేయలేదని పరిగణిస్తుంది? దుందుడుకు వైఖరితో తమను విభేదించే వాళ్లందరినీ మట్టుపెట్టాలనే ఉద్దేశంతో సీఎం జగన్ నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్‌చేస్తే, కేంద్రంలో రాహుల్‌గాంధీ తాకిడి తట్టుకోలేని వాళ్లు దర్యాప్తు సంస్థలు తదితరాలను ఉపయోగించుకుని ఆయనపై అనర్హత వేటు వేసినట్లు నారాయణ విమర్శించారు. ఈ రెండూ నిరాశా నిస్పృహలతో చేసే పనులే తప్ప మరొకటి కాదని వ్యాఖ్యానించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ అరాచక రాజకీయ విధానాలు అవలంబిస్తున్నారని నారాయణ ధ్వజమెత్తారు.

టీడీపీకి ఇక ఎదురులేదు

- వచ్చే ఎన్నికల్లో గెలుపు ఖాయం
- వైసీపీ ఎమ్మెల్యేలే జగన్‌పై తిరగబడ్డారు చంద్రబాబు
- టీడీపీలో చేరిన కోటంరెడ్డి గిరిధర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ ఇక అన్‌స్టాపబుల్ అని, గేర్ మార్చి స్పీడ్ పెంచుతామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. జగన్‌పై నమ్మకం లేక వైసీపీ ఎమ్మెల్యేలే తిరగబడే పరిస్థితి నెలకొందన్నారు. సీఎం జగన్ చేసిన విధ్వంసం వల్ల ఏపీ 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డి శుక్రవారం నెల్లూరు నుంచి వందలాది మంది అనుచరులతో భారీ ర్యాలీతో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం టీడీపీ జోన్-3 సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఇకపై వైసీపీ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని, అధికార పార్టీ మరిన్ని ఇబ్బందులు పెట్టినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. జగన్‌ది ధన బలమైతే టీడీపీది జనబలమన్నారు. పేదలను దోచుకున్న జగన్ పేదల ప్రతినిధిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేశంలో అందరి ముఖ్యమంత్రులకున్న ఆస్తి కంటే జగన్ ఆస్తి ఎక్కువన్నారు. పట్టభద్రుల్లో తిరుగుబాటు వచ్చిందని, దాని ఫలితమే ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని చంద్రబాబు అన్నారు. కష్టపడ్డ కార్యకర్తలను వెతుక్కుంటూ పార్టీనే వాళ్ల వద్దకు వస్తుందని, వచ్చే ప్రభుత్వంలో పైరవీలు ఉండవని తేల్చి చెప్పారు. పార్టీ కోసం పనిచేసే వారే తన ఆప్తులని, వారికే ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించారు. రాష్ట్రాన్ని బాగుచేయడం ఎంత ముఖ్యమో, తెలుగుదేశం కుటుంబ సభ్యులను బాగుచేయడం అంతే ముఖ్యమని ఉద్ఘాటించారు. గతంలో తాను కార్యకర్తలకు ఎక్కువ సమయం ఇవ్వలేకపోయిన మాట వాస్తవమేనన్న చంద్రబాబు, రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలి, అభివృద్ధి చేయాలనే ఆలోచనలో ఉండిపోయానన్నారు. ఈసారి కార్యకర్తలకే పెద్దపీట వేస్తామని, ఎన్ని పనులున్నా కార్యకర్తలే ముఖ్యమని చెప్పారు. టీడీపీ బలపడింది కాబట్టి జగన్ నవంబరులోనో, డిసెంబరులోనూ ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని, దాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలుగుదేశం క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చాక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక మంత్రిని నియమిస్తామని చెప్పారు. గ్రామ స్థాయిలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంతలో పశువుల మాదిరిగా తెలుగుదేశం ఎమ్మెల్యేలను వైసీపీ కొనుగోలు చేసిందని మండిపడ్డారు. ఈ ఏడాది మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఒక్కసారి అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌కు ఇదే చివరిసారి కావాలన్నారు.

10 స్థానాల్లో టీడీపీ గెలుస్తుంది: గిరిధర్ రెడ్డి

రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం చాలా అవసరమని, అందరి సలహాలు, సూచనలు తీసుకున్నాకే టీడీపీలో చేరానన్నారు. నెల్లూరు జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలను వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెల్చి తీరుతుందని స్పష్టం చేశారు. తనను, తనతో పాటు వచ్చిన అనుచరులను తెలుగుదేశం కుటుంబంలో భాగస్వాములుగా చేసుకున్నందుకు చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు కేంద్రం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ)ను 4శాతం పెంచుతూ శుక్రవారం జరిగిన కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం 38 శాతంగా ఉన్న డీఏ 42 శాతానికి పెరగనుంది. ఈ మేరకు కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. డీఏ పెంపుతో కేంద్ర ప్రభుత్వంపై రూ.12,815 కోట్ల భారం పడనున్నట్లు తెలిపారు.

ఎస్సీ జాబితాలో దళిత క్రిస్టియన్లు

- బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల్లో చేర్చాలి
- అసెంబ్లీలో రెండు కీలక తీర్మానాలు
- కేంద్రానికి పంపనున్నట్లు సీఎం జగన్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దళిత క్రిస్టియన్లను ఎస్సీల జాబితాలో చేర్చాలని, బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల్లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏపీ శాసనసభ శుక్రవారం రెండు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. వీటిని తక్షణమే కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రకటిం చారు. ఈ సందర్భంగా ఆయన సభలో మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా ఎస్టీ హోదా కోసం పోరాటం చేస్తున్నామని, తమను ఎస్టీలలో చేర్చాలని బోయ, వాల్మీకి కులాల వారు తన సుదీర్ఘపాదయాత్రలో విజ్ఞప్తి చేసినట్లు గుర్తు చేశారు. 'పక్క రాష్ట్రం కర్ణాటకకు చెందిన బళ్లారిలో తమ కులస్తులకు ఎస్టీ హోదా ఉందని, ఇక్కడ మాత్రం రాయలసీమ జిల్లాలలో ఇవ్వలేదని దశాబ్దాలుగా తమ ఆవేదనను ఆ కులాల వారు చెప్పుకుంటూ వస్తున్నారు. ఎస్టీ హోదా ఇవ్వడం అన్నది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేని అంశమైనప్పటికీ... ఒకరికి అన్యాయం జరిగిందని చెబుతున్నప్పుడు, మనకు చేతనైనంత ఉపశమనం కలిగించడం బాధ్యత, మానవత్వం ప్రతి మనిషిలో ఉండాలి. అందులో భాగంగానే ఎన్నికలప్పుడు మేనిఫెస్టోలో చెప్పినవిధంగా అధికారంలోకి వచ్చిన తర్వాత బోయ, వాల్మీకి కులస్తుల స్థితిగతులపై నివేదిక ఇవ్వడానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ కుమార్ అధ్వర్యంలో కమిషన్‌ను నియమించాం. ఈ కులస్తులు అధికంగా ఉండే రాయలసీమ ప్రాంతంలో కమిషన్ విస్తృతంగా పర్యటించి ఆ కులస్తులకు సంబంధించిన కుటుంబాలపై అధ్యయనం చేసి వారి జీవనప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు, సామాజిక స్థితిగతులు, వారి గత చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించి ఒక నివేదిక తయారు చేసింది. ఆ నివేదికను పొందుపరిచి బోయ, వాల్మీకి సహా వారి అనుబంధ కులాలను ఎస్టీ జాబితాలో చేర్పించాలని కమిషన్ కూడా సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను పరిగణనలోకి తీసుకొని బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేలా కేంద్రానికి సిఫారసు చేస్తూ ఈ తీర్మానాన్ని మనం అసెంబ్లీ ద్వారా పంపుతున్నాం' అని సీఎం వివరించారు. అలాగే వీరికి ఎస్టీ హోదా కల్పించాలంటూ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం వల్ల ఎస్టీలకు ఎలాంటి అన్యాయం జరగదని స్పష్టం చేశారు. ఒకరికి న్యాయం చేస్తున్నామంటే ఇంకొకరికి అన్యాయం చేస్తున్నట్టు కాదని, అన్యాయం చేయాలన్న అభిప్రాయం కానీ, ఉద్దేశం కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, తనకు లేదని జగన్ పునరుద్ఘాటించారు.

ఎస్సీలుగా దళిత క్రైస్తవులు

'దళిత క్రైస్తవులను ఎస్సీలుగా పరిగణించాలంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. మరలా ఈరోజు మన చట్టసభలో మనం కూడా ఇదే తీర్మానం మళ్లీ చేస్తూ పంపిస్తున్నాం' అని సీఎం జగన్ చెప్పారు. దీనిపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. ఆ కేసులో ఆంధ్రప్రదేశ్ తరపున అధికారికంగా ఇంప్లీడ్ అయి మన వాదన వినిపిస్తున్నాం. ఎందుకంటే దళితుడు ఇదివరకు తాను ఆచరిస్తున్న మతాన్ని విడిచి మరో మతంలోకి తాను వెళ్లినంత మాత్రాన వారి సాంఘిక, ఆర్థిక, జీవన స్థితిగతుల్లో ఎలాంటి మార్పు రాదన్న సంగతి అందరికీ తెలుసని జగన్ చెప్పారు. మతం అన్నది నాలుగు గోడల మధ్య ఆ మనిషికి, దేవుడికి ఉన్న సంబంధమని, అయినప్పటికీ మత మార్పిడి వలన వీళ్లకు రావాల్సిన ఎస్సీల హక్కులు రాకుండా పోవడం అన్యాయమని చెప్పి కచ్చితంగా నమ్ముతున్న సభగా ఈ తీర్మానం చేసి కేంద్రానికి పంపుతున్నట్లు చెప్పారు.

16 మంది మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్‌లో 16 మంది మావోయిస్టులు శుక్రవారం జగదల్పూర్ పోలీసు ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జగదల్పూర్ పర్యటన వేళ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది చొరవతో మావోయిస్టులు లొంగిపోవడం విశేషం. వివరాల్లోకి వెళితే బస్తర్ డీఐజీ సుందర్‌లాల్ పట్వా, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్‌లు ఆర్‌వీ రాయ్, డి.అనీయాదవ్, జగదల్పూర్ పోలీసు ఉన్నతాధికారి హరిజిన్దర్ సింగ్, సుకుమా ఎస్పీ సునీల్ శర్మ, అరుణ్ కుమార్, కుల్దీప్ కుమార్ జైన్, విక్రమ్ కుమార్ సింగ్ కృషి ఫలితంగా మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించే పథకాన్ని మావోయిస్టులకు తెలియజేసి...వారు జనజీవన స్రవంతిలోకి రావడానికి దోహదపడ్డారు. లొంగిపోయిన మావోయిస్టుల తలపై లక్ష రూపాయల నుండి 8 లక్షల రూపాయల వరకు రివార్డు ఉంది. లొంగిపోయిన వారిలో కోవాసి పాలే, పోడియం చుక్క, పోడియం పొజ్జ, పద్దం సోమ, సోడి బుద్రి, పదం దేవా, మడివి అయిత, హేమల మూసా, మడివి హిడమ, వేక పొజ్జ, కోవాసి నీలం, కోవాసి మోటు, కొవ్వాసి సోముడు, మడకం సోముడు, మడకం సుకుడా, మడకం హడమ ఉన్నారు. వారిబాటలోనే మిగతా సభ్యులు లొంగిపోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఏవోబీలో మావోయిస్టుల డంప్ లభ్యం

విశాలాంధ్ర- సీలేరు : ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో ఒడిశా పోలీసులు గురువారం మావో యిస్టుల డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా పోలీసులు అందించిన వివరాల మేరకు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన బలిమెల రిజర్వాయర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల డంప్ ఉందన్న పక్కా సమాచారంతో మంగళవారం నక్కమామిడి పంచాయతీ పరిధిలోని లారిగుడ, తైమల్ గ్రామాల అటవీ ప్రాంతాన్ని బీఎస్ఎఫ్ పోలీసు బలగాలు గాలించాయి. దీంతో అక్కడ మావోయిస్టుల డంప్ లభించింది. ఈ డంప్‌లో స్టీల్ టిఫిన్ బాక్సులో ఎల్ఐఈడీలు 3, ఎస్‌బీఎంఎల్ గన్‌లు 2, ఒక ఎస్‌బీఎంఎల్ బేరల్, రెండు ఎస్‌బీఎంఎల్ ఖాళీ కేసులు, హ్యాండ్ గ్రెనేడ్లు 11, నాన్ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు 28 లభించినట్లు పోలీసులు తెలిపారు.

విస్తరిస్తున్న మాల్‌పూరి వ్యాపారం

విజయవాడలో ప్రారంభించిన నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ(కృష్ణలంక): పట్టణాలు, నగరాల్లో మాల్‌పూరి వ్యాపారం విస్తరిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మిఠాయి రంగంలో పేరెన్నికగన్న మాల్‌పూరి వ్యాపారానికి గుంటూరు నగరం ప్రసిద్ధి చెందిందని చెప్పారు. ఈ రంగంలో సుదీర్ఘకాలం అనుభవం గల గుంటూరు యువకుడు, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర నాయకుడు షేక్ వలి తన వ్యాపారాన్ని విస్తృత పర్చేందుకు విజయవాడ చిట్టినగర్ సొరంగం సమీపంలోని మసీదు ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన సుభానీ మాల్‌పూరి సెంటర్‌ను శుక్రవారం ఉదయం నారాయణ ప్రారంభించారు. నారాయణతోపాటు విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పాల్గొన్నారు. వలి కుటుంబ సభ్యులను అభినందించారు. మిఠాయి వ్యాపారంలో మరింత రాణించి ప్రజలకు మంచి మిఠాయి రుచి చూపాలని ఆకాంక్షించారు. పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, స్నేహితులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు, మోతుకూరి అరుణకుమార్, ఎస్కే నజీర్, శివారెడ్డి, జాన్సన్‌బాబు, సాయికుమార్, నాసర్‌జీ పాల్గొన్నారు.

నంద్యాల డీఈఓ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పరీక్షల సమయంలో ఉపాధ్యాయులు పోలీస్‌స్టేషన్లో కూర్చోవాలని నంద్యాల జిల్లా విద్యాధికారి ఇచ్చిన ఉత్తర్వుల్ని తక్షణమే ఉపసంహరించాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ గతేడాది పదో తరగతి పరీక్షల సమయంలో కొలిమి గుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మాస్ కాపీయింగ్‌పై కొంతమంది ఉపాధ్యాయులకు సంబంధం ఉందని విచారణ చేసిన అధికారులు... వారికి తగిన శిక్ష విధించారని గుర్తుచేశారు. ఆ పరీక్షల రోజు పోలీస్ స్టేషన్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కూర్చోవాలని నంద్యాల జిల్లా విద్యాధికారి అనురాధ ఉత్తర్వులు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. ఇది ఉపాధ్యాయులను అనుమానించడమేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించాలని, లేకుంటే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడి స్తామని ఆయన హెచ్చరించారు.

తల్లి పులి జాడ ఎక్కడ?

కొల్హాపూర్ నల్లమల అడవుల్లో ఆచూకీ లభించినట్లు వదంతులు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: నల్లమలలో నాలుగు కూనలకు జన్మనిచ్చి కానరాకుండా పోయిన తల్లి పులి తెలంగాణా రాష్ట్రం కొల్హాపూర్ అడవుల్లో సంచరి స్తున్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. నల్లమలలోని పెద్దగుమ్మదారం ప్రాంతంలో మార్చి మొదటి వారంలో ఒక పెద్ద పులి నాలుగు కూనలకు జన్మనిచ్చి ఎటో వెళ్లిపోయింది. గ్రామ శివారు ప్రాంతంలో సంచరిస్తున్న పులి కూనలను చూసిన ప్రజలు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందచేశారు. అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పెద్ద పులి పిల్లలను స్వాధీనం చేసుకుని వాటి పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. తల్లి పులి కోసం పెద్దఎత్తున 300 మంది అధికారులు నల్లమలలోని 200 కిలోమీటర్ల పరిధిలో 40 ట్రాప్ కెమెరాలు పెట్టి పులి జాడ కోసం ప్రయత్నించారు. కానీ తల్లి పులి జాడ కానరాకపోవడంతో అధికారులు పులి పిల్లలను తిరుపతికి తరలించారు. కానీ తల్లి పులి ఏమైంది అనే ప్రశ్నకు నేటికీ సమాధానం లేదు. ఏ జంతువు అయిన తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా తన పిల్లలను కాపాడుకోవడం కోసం పరితపిస్తుంటాయి. కానీ పులి పిల్లలను వదలి ఎక్కడికి పోయిందనేది నేటికీ అంతుచిక్కడం లేదు. గ్రామం సమీపంలోకి పులి వచ్చిన సమాచారం తెలుసుకున్న ఎవరైనా వేటగాళ్లు ఉచ్చులు వేసి చంపారా అని అనేక మంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తల్లి పులి నుంచి పులి పిల్లలు సుమారు ఆరు మాసాల కాలం పాటు పాలు తాగుతాయని తెలుస్తోంది. ఇటువంటి సమయంలో పులి తన పిల్లలను వదిలిపోయే అవకాశం లేదు. అయితే తల్లి పులి ఎక్కడికి పోయిందనే దానిపై అధికారులు పెద్దఎత్తున అన్వేషిస్తున్నా ఎటువంటి ఆధారాలూ లభించలేదు. నల్లమలలో సుమారు 73 పులులు ఉన్నట్లు అటవీ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇటీవలే ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం ప్రాంతంలో కొంతమంది వేటగాళ్లు పెద్దపులిని చంపి, దాని మాంసం వండుకొని తిన్న సంఘటన వెలుగుచూసింది. ఆ సంఘటన మరువక ముందే కొత్తపల్లి మండలం పెద్దగుమ్మదారం వద్ద తల్లి పులి ఆచూకీ లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కొల్లాపూర్ అడవులకు పోవాలంటే కూడా కృష్ణానది దాటి అవతలకి పోవలసి ఉంది. అయితే ప్రస్తుతం నీటి ఉధృతి తక్కువగా ఉండటం వలన ఈత కొట్టుకుంటూ అవతలికి పోవలసి ఉంటుంది. దీనిని ఇంకా నిర్ధారించలేదని, అయితే ఆడ పులి నల్లమలలోనే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారని అటవీ అధికారులు అంటున్నారు. ఇంకా పూర్తి సమాచారం తెలియవలసి ఉందని వారు తెలిపారు.

విశాఖ ఉక్కుపై పార్లమెంట్‌లో చర్చేది?

వైసీపీ ఎంపీలకు శ్రీనివాసరావు ప్రశ్న

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్ర ఎంపీలు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు విశాఖలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్ ప్రస్తుత సమావేశాలలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరోధించి, ప్రభుత్వ రంగంలో అభివృద్ధి చేయడానికి ఎలాంటి చర్చ జరగలేదన్నారు. జనవరి 30న స్టీల్ ప్లాంట్‌లో జరిగిన బహిరంగ సభలో దీన్ని పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కార్మికులకు అధికార పార్టీ నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఆ దిశగా ఒక్క అడుగూ ముందుకు పడలేదని చెప్పారు. మన రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యులు ప్రత్యేకించి అధికార పార్టీకి చెందిన ఎంపీలు చొరవ తీసుకుని ఇతర పార్టీలను కూడగట్టి పార్లమెంట్‌లో ప్రభుత్వం నుంచి నిర్దిష్ట హామీ పొందేందుకు ప్రయత్నించాలని కోరారు. కార్మికులు, ఉద్యోగులు, యాజమాన్యం సమష్టి కృషితో అది ఇప్పటికీ సమర్థంగా నడుస్తున్నదన్నారు. దీన్ని కాపాడుకోకుండా గ్లోబల్ ఇన్వెస్టర్స్‌తో వచ్చే ఫలితమేమీ ఉండదన్నారు. విశాఖ స్టీల్ ను ప్రైవేటీకరించినా లేదా మూసివేసినా వేలాది మంది కార్మికులు వీధిన పడతారని తెలిపారు. ప్రైవేటీకరణను ఆపడంతోపాటు సొంత గనుల కేటాయింపు, ప్లాంటు విస్తరణ కోసం కృషి చేయాలని కోరారు. ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని పార్లమెంటులో మంత్రులు రెండు, మూడు సార్లు తెగేసి చెప్పినా మన ఎంపీలు ఎలాంటి ప్రతిఘటన చేయలేదని విమర్శించారు.

గన్నవరంలో విత్తన పరిశోధన, శిక్షణ కేంద్రం

వ్యవసాయ మంత్రి కాకాని శంకుస్థాపన

విశాలాంధ్ర-గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరంలో రూ.46 కోట్లతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో వైయస్సార్ విత్తన పరిశోధన శిక్షణ కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయమంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జిమంత్రి ఆర్కే రోజా, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగన సభకు వల్లభనేని వంశీమోహన్ అధ్యక్షత వహించారు. మంత్రి కాకాని గోవర్ధన్ మాట్లాడుతూ దేశంలో వారణాసిలో మాత్రమే జాతీయ విత్తన పరిశోధన కేంద్రం ఉందని, మొదటిసారి మన రాష్ట్రంలో విత్తన పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ముఖ్యమంత్రి సంకల్పించడం రైతు సంక్షేమంపై ఆయన కున్న చిత్తశుద్ధిని సూచిస్తున్నదని చెప్పారు. వ్యవసాయానికి సంబంధించిన సూచనలు, సలహాలు అందిస్తూ రైతులకు సేవలందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 10,778 ఆర్‌బీకేలు, అన్ని నియోజకవర్గాలలో అగ్రి ల్యాబ్‌లు ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. విత్తనం మంచిదైతే మంచి దిగుబడి వస్తుందని, అందుకే విత్తనంపై దృష్టి పెట్టామని చెప్పారు. ఆర్‌బీకేలలో పనిచేస్తున్న వ్యవసాయ, మత్స్య సహాయకులకు విత్తన పరిశోధనపై తగిన శిక్షణ ఇస్తున్నామన్నారు. 8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే పరిశోధన కేంద్రాన్ని ఏడాదిలోగా పూర్తిచేసి... రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మంత్రి రోజా మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, అన్ని వాతావరణాలను తట్టుకుని మంచి దిగుబడులిచ్చే విత్తనం రైతులకు అందించాలని వైయస్సార్ విత్తన పరిశోధన శిక్షణ కేంద్రాన్ని ఇక్కడ నిర్మిస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతులకు అండగా నిలిచే ముఖ్యమంత్రి జగనన్నకు అందరూ మద్దతివ్వాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, ఎండీ శేఖర్‌బాబు, అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేశ్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జె.రాఘవరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు వీకే వెంకట్రామిరెడ్డి కన్నుమూత

విశాలాంధ్ర-అనంతపురంఅర్బన్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సీనియర్ నాయకుడు వీకే వెంకట్రామిరెడ్డి శుక్రవారం తెల్లవారు జామున అనారోగ్య కారణాలతో మృతి చెందారు. జిల్లాకు చెందిన కమ్యూనిస్టు నేతలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు వెంకట్రామిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వెంకట్రామిరెడ్డి ప్రముఖ కమ్యూనిస్టు నేత అమరజీవి వీకే ఆదినారాయణ రెడ్డి అన్న కుమారుడు. మహిళా సమాఖ్య నేత బి. పార్వతమ్మ ఆయన మేనత్త. విద్యార్థి దశ నుంచే వెంకట్రామిరెడ్డి కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితు డయ్యాడు. ఆయన నరసరావుపేటలో ఇంటర్మీడియేట్ విద్య అభ్యసించి విజయవాడ ఎస్సార్ఆర్, సీవీఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్నారు. 1955-58 మధ్యకాలంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)లో క్రియాశీలంగా పనిచేసి విద్యార్థి విభాగానికి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు అమరజీవి కొల్లి నాగేశ్వరరావు, పువ్వాడ నాగేశ్వరరావుకు ఆయన సహ విద్యార్థి. సొంత జిల్లా అనంతపురం జిల్లా యాడికి మండలం వేములపాడు గ్రామ పంచాయితీకి వెంకట్రా మిరెడ్డి రెండుసార్లు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. రెండుమార్లు సింగిల్ విండో ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1983లో తాడిపత్రి అసెంబ్లీ నియోజక వర్గానికి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. తాడిపత్రి ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా భూస్వా ములు, పెత్తందార్లు, పాలకుల అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి వెంకట్రా మిరెడ్డి. యాడికి మండలంలో ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అవినీతి పాలకుల దౌర్జన్యాలు, అరాచకాలు, అక్రమ వసూళ్లకు వ్యతిరేకంగా ఉద్యమ నాయకుడుగా ఎర్ర సైనికులతో కలసి పోరాటం చేశారు. ఆ పోరాటంలో పోలీసుల కాల్పుల్లో ముగ్గురు కమ్యూనిస్టు నాయకులు మృతి చెందారు. వీకే ఆదినారాయణ రెడ్డి స్ఫూర్తితో కుటుంబం మొత్తం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ముఖ్య భాగస్వాములయ్యారు. ఆయన సోదరి పార్వతమ్మ మహిళా ఉద్యమ నాయకురాలిగా, సోదరుడు విశ్వనాథరెడ్డి ఏఐఎస్ ఎఫ్ నేతగా రాణించారు. వెంకట్రామిరెడ్డి తమ్ముడు వీకే రంగారెడ్డి, కుమారుడు ప్రదీప్ రెడ్డి, కుమార్తె రాధ ఏఐఎస్ఎఫ్. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాల్లో క్రియాశీలంగా పని చేశారు.

రామకృష్ణ సంతాపం: వెంకట్రామిరెడ్డి మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు అయిన వెంకటరామిరెడ్డి విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు భావజాలం పట్ల ఆకర్షితులై ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా పనిచేశారు. తదుపరి రైతాంగ సమస్యలపై ముందు పీఠిన నిలబడి పోరాడారు. వేములపాడు గ్రామ సర్పంచ్ గా దీర్ఘకాలం ప్రజా సేవలు అందించారని కొనియాడారు. వికే వెంకటరామిరెడ్డి మృతికి సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సాను భూతిని రామకృష్ణ తెలిపారు.

ప్రజా పోరాటాలతో కేంద్రానికి బుద్ధిచెప్తాం

ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: వేలాది కుటుంబాలు ఆధారపడ్డ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని కుట్ర పన్నుతున్న కేంద్ర ప్రభుత్వానికి త్వరలో ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 771వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమానికి హాజరైన బ్లాస్ట్ ఫర్నేస్ విభాగ కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నేత వరసాల శ్రీనివాస రావు, డి అదినారాయణ, ఎస్. రామారావు మాట్లాడుతూ, మూడు నెలలు నిల్వ ఉండాల్సిన ముడి సరుకును కేవలం కొన్ని రోజులకే పరిమితం చేస్తు న్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల ఆకాంక్షల్ని గాలికొదిలేసి కార్పొరేట్ వ్యవస్థలకే కొమ్ముకాస్తున్న బీజేపీ విధానాల్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. తీసుకున్న రుణాలకు పైసాతో సహా వడ్డీలు కడుతున్న స్టీల్ ప్లాంట్‌కు అసలు వడ్డీ మాఫీ చేయకపోగా మోదీ సర్కారు సృష్టించిన బొగ్గు కొరతతో ఆకాశాన్ని అంటుతున్న ముడిసరుకు కొనుక్కోవడానికి అదనపు రుణాలకు స్టీల్‌ప్లాంట్‌కు అనుమతి లేకుండా మోకాలు అడ్డుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే ముడిసరుకు నిల్వలు హరించిపోయాయన్నారు. కార్యక్ర మంలో యు రామస్వామి, శ్రీనివాస రాజు, డేవిడ్, పి. శ్రీనివాస్, నరేంద్ర, అలమండ శ్రీనివాసరావు, సైన్ బాబు, ఆర్.వెంకట్రావు, రవి కిరణ్, మల్లేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవో-1 రద్దుపై టీడీపీ వాయిదా తీర్మానం

మండలి చైర్మన్ తిరస్కరణ... సభ్యుల వాకౌట్

గుంటూరు ఛానల్ పొడిగింపునకు చర్యలు : మంత్రి అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : శాసన మండలి ప్రారంభం కాగానే జీవో నంబరు-1 రద్దుపై చర్చించాలని టీడీపీ సభ్యులు అంగర రామ్మోహన్, చిక్కాల రామచంద్రరావు తదితరులు శుక్రవారం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. దీంతో టీడీపీ సభ్యులు కొంతసేపు మండలిలో నిరసనకు దిగారు. జీఓ నంబరు-1 రద్దుపై చర్చించాలంటూ పట్టుపట్టగా చైర్మన్ అనుమతించకపోవడంతో టీడీపీ సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం ప్రశ్నోత్తరాల సమయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి ఇటీవల తీసుకున్న చర్యలు, నిర్దిష్ట పదవులలో వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్ వివరాలు, 2019 నుంచి వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఖర్చు చేసిన మొత్తం వివరాలపై సభ్యులు రాజగొల్ల రమేష్ యాదవ్, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కృష్ణరాఘవ, జయేంద్ర భరత్, పోతుల సునీత తదితరులు అడిగిన ప్రశ్నకు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సమాధానమిచ్చారు. బీసీ వర్గాల సంక్షేమం కోసం, ప్రత్యేకించి వెనుకబడిన వర్గాల కోసం నవరత్నాల కింద మత్స్యకార భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న చేదోడు తదితర అనేక కొత్త పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందంటూ వివరించారు. నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు 2019లో 24వ చట్టాన్ని రూపొందించిందన్నారు.

రెవెన్యూ లోటు గ్రాంట్ రూ.2,691 కోట్లు : ఆర్థిక మంత్రి బుగ్గన

కేటగిరీల వారీగా పన్నుల పంపిణీ, రెవెన్యూ లోటు, ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించిన నిధుల వివరాలు, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మంజూరయిన నూతన ప్రాజెక్టులు, అభివృద్ధి పథకాల వివరాలపై సభ్యులు ఎన్ఎండీ ఫరూక్, శివనాథరెడ్డి అడిగిన ప్రశ్నకు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బదులిచ్చారు. 2023-24 కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి చేసిన కేటాయింపులుగా కేంద్ర పన్నులలో వాటా రూ.41,338.02 కోట్లు, రెవెన్యూ లోటు గ్రాంటు రూ.2,691 కోట్లు, ఆర్థిక సంఘం గ్రాంట్లు రూ.8077.33 కోట్లు, కేంద్ర ప్రతిపాదిత పథకాలు కోసం రూ.19794.76 కోట్లు అని వివరించారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు గిరిజన విశ్వవిద్యాలయాల కోసం రూ.30 కోట్లు, అనంతపురంలో కేంద్ర విశ్వవిద్యాలయ స్థాపన కోసం రూ.40 కోట్లు, విశాఖపట్నంలో భారత పెట్రోలియం, ఇంధన సంస్థ కోసం రూ.168 కోట్లు, జాతీయ డిజైన్స్ సంస్థ, గుంటూరు కోసం రూ.23.2 కోట్లు, అనంతపురం ప్రశాంతి నిలయం కోసం రూ.0.12 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు.

జూన్ 2024కు గుంటూరు ఛానల్ పూర్తికి చర్యలు : అంబటి

గుంటూరు ఛానెల్‌ను పొడిగించేందుకు ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రణాళిక ఉందా?, భూ సేకరణకు కేటాయించిన నిధులు మొత్తం ఎంత? ఈ ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేస్తారంటూ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు అడిగిన ప్రశ్నకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమాధానం ఇచ్చారు. గుంటూరు ఛానెల్ విస్తరించడం కోసం అవసరమైన భూసేకరణ నిమిత్తం రూ.113.39 కోట్ల మొత్తాన్ని కేటాయించారని, జూన్ 2024 నాటికి పథకాన్ని పూర్తిచేసే ప్రతిపాదనలున్నాయని మంత్రి వివరించారు. జగనన్న విద్యా దీవెన పథకం లబ్ధిదారుల సంఖ్య, ఖర్చు మొత్తం వివరాలపై సభ్యులు రాజగొల్ల రమేష్ యాదవ్, విక్రాంత్, లేళ్ల అప్పిరెడ్డి, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు అడిగిన ప్రశ్నకు సాంఘిక సంక్షేమ మంత్రి సమాధానమిచ్చారు.

గిరిజన విశ్వవిద్యాలయాలకు మౌలిక సౌకర్యాలు : విద్యా శాఖ మంత్రి బొత్స

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, భూమిని కేటాయించడం, విశ్వవిద్యాలయం ప్రాంగణం వరకు విద్యుత్ సరఫరా, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, నీటి సరఫరాను కల్పించామని, తమ ప్రభుత్వ బాధ్యతగా మౌలిక సదుపాయాల కల్పన ప్రక్రియ దిశలో చర్యలు చేపట్టిందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఉత్తరాంధ్రలో గిరిజన విశ్వ విద్యాలయ పనుల పురోగతి వివరాలపై సభ్యులు దువ్వారపు రామరావు, చిక్కాల రామచంద్రరావు, అంగర రామ్మోహన్ తదితరులు అడిగిన ప్రశ్నకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స బదులిచ్చారు. అనంతరం బీసీ కులాల కోసం 50కి పైగా కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన విషయం వాస్తవమేనా?, 2022-23 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో నవరత్నాలు కాకుండా బీసీలకు రుణ సదుపాయం కోసం ఖర్చు చేసిన మొత్తం వివరాలపై సభ్యులు తిరుమల నాయుడు, దువ్వారపు రామారావు, అంగర రామ్మోహన్ తదితరులు అడిగిన ప్రశ్నకు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ బదులిచ్చారు. ప్రభుత్వం గ్రూప్-ఏ నుంచి ఈ వరకు వెనుకబడిన తరగతుల జాబితాలో ఉన్న మొత్తం 139 కులాలు/కమ్యూనిటీలకు వర్తించేలా 56 బీసీ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందన్నారు. అల్ప సంఖ్యాక వర్గాల కోసం అమలు చేస్తున్న పథకాల వివరాలు, వారి సంక్షేమం కోసం ఖర్చు చేసిన మొత్తం వివరాలపై సభ్యులు ఇసాక్ బాషా, షేక్ మొహమ్మద్ ఇక్బాల్, మొహమ్మద్ రుహుల్లా తదితరులు అడిగిన ప్రశ్నకు ఉప ముఖ్యమంత్రి (అల్ప సంఖ్య వర్గాల సంక్షేమం) షేక్ అంజాద్ బాషా బదులిచ్చారు. 2019-20 నుంచి 2022-23 వరకు మైనార్టీల సంక్షేమం కోసం ఖర్చు చేసిన మొత్తం రూ.21,756.69 కోట్లని, వివిధ పథకాల కోసం డీబీటీ విధానంలో 32,90,205 మంది లబ్ధిదారులు, నాన్ డీబీటీ విధానంలో 16,80,156 మంది లబ్ధిదారులుగా, వెరసి 49,70,361 మంది లబ్ధిదారులకు రూ.21,756.69 కోట్లు ఖర్చు చేశామని మంత్రి తెలిపారు. చివరి రోజు శాసన మండలి ఏడు బిల్లులను ఆమోదించింది.

BOARD OF INTERMEDIATE EDUCATION, A.P.
Eswar Elite, Beside Sonovision Showroom, Tadepalli, Guntur.

Rc. No. 65/D1/23 Dated: 24-03-2023

SHORT TENDER NOTICE

The Secretary, Board of Intermediate Education, Andhra Pradesh, invites Sealed Tenders from the reputed and experienced firms located at Vijayawada & Guntur for Providing Security Guards and Housekeeping Staff to the O/o. Secretary, BIE, AP located at R.No. 114/C3, Eswar Elite, Beside Sono-vision, Tadepalle, Guntur-522 501. The Participants can visit website https://bie.ap.gov.in for details.

Sd/- M.V. Seshagiri Babu, I.A.S., Secretary

టెండరు ప్రకటన

మంగళగిరి తాడేపల్లి నగరపాలకసంస్థ, ప్రత్యేక నిధుల క్రింద మొత్తం 36 పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీలయందు ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తం పనులు: 20 నెం.లు. అంచనా వ్యయం:రూ.260.78 లక్షలు.

పని నెం. 01 నుండి 09 వరకు.

4. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది:25.03.2023 ఉ॥గం11ని॥ల నుండి
5. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది:28.03.2023 ఉ॥గం11ని॥ల వరకు
6. ప్రైస్ బిడ్ తెరుచు తేది. ది:28.03.2023 మధ్యాహ్నము గం॥2-00ని॥ లకు

పని నెం. 10 నుండి 20 వరకు:

4. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది:25.03.2023 ఉ॥గం11ని॥ల నుండి
5. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది:01.04.2023 ఉ॥గం11ని॥ల వరకు
6. ప్రైస్ బిడ్ తెరుచు తేది. ది:01.04.2023 మధ్యాహ్నము గం॥2-00ని॥ లకు

మిగతా వివరములు ఇ-ప్రొక్యూర్మెంట్ వెబ్సైట్ http://www.apeprocurement.gov.in చూడగలరు.

(సం/-) యు. శారదా దేవి
మొబైల్ నెం.9849907303. కమీషనర్, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

సంపాదకీయం

చట్టం పేర ధర్మం బలి

రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవ లేనట్టు ప్రధాన మంత్రి మోదీ తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అయిన రాహుల్ మీద కక్ష తీర్చుకోవాలంటే న్యాయస్థానాల దగ్గర నుంచి, పార్లమెంట్ సెక్రటేరియట్ వరకు అన్నీ విపరీతమైన వేగంతో పనిచేస్తాయి. 2019లో కర్నాటకలోని కోలార్‌లో ఎన్నికల ప్రచారసభలో మాట్లాడుతూ "నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ" ఇలా దొంగలందరి ఇంటి పేర్లు మోదీ అనే ఎందుకు ఉంటుంది అన్నందుకు సూరత్‌లోని ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హెచ్.హెచ్.వర్మ రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలుశిక్ష విధించారు. ఏ కేసులో అయినా జైలుశిక్షపడితే నేరస్థుడి కిందే లెక్క కనక, రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యుడు గనక ఆ సభ్యత్వం రద్దవుతుంది. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి పనిగట్టుకుని తనకు ప్రత్యర్థిగా భావిస్తున్నారు గనక లోక్‌సభ సెక్రటేరియట్ సూరత్ మేజిస్ట్రేట్ తీర్పు వెలువడిన మర్నాడే లోక్‌సభ సభ్యునిగా అనర్హుడిగా ప్రకటించింది. ఈ తీర్పు చెప్పిన మేజిస్ట్రేట్ వర్మ దోషిగా తేలిన రాహుల్ హైకోర్టులో అప్పీలు చేసుకోవడానికి అనువుగా శిక్ష అమలు కాకుండా 30 రోజులు గడువిచ్చారు. అంటే శిక్ష అమలుపై స్టే విధించారు. కానీ నేరనిర్ధారణ మీద స్టే విధించలేదు. పరువునష్టం కేసుల్లో, ముఖ్యంగా నేరపూరిత పరువునష్టం కేసుల్లో అత్యధికంగా రెండేళ్లు మాత్రమే శిక్ష విధించవచ్చు. ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వర్మ సరిగ్గా అదే పనిచేశారు. ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వర్మ ఇచ్చిన తీర్పు తప్పా..ఒప్పా అన్న విషయం ఈ వ్యవహారంపై హైకోర్టులో విచారణ ముగిస్తేనేగాని తేలదు. కానీ దిల్లీలో నివసించే వ్యక్తి ఎక్కడో కర్ణాటకలోని కోలార్‌లో, అదీ ఎన్నికల ప్రచార సమయంలో చేసిన ప్రసంగంలో మోదీ ఇంటి పేరు ఉన్న వారందరూ దొంగలుగా ఎందుకుంటారు అని ప్రశ్నిస్తే గుజరాత్‌లో ఉన్న ఓ వ్యక్తి కేసు దాఖలుచేస్తే సదరు మేజిస్ట్రేటుకు దాన్ని విచారించే అధికార పరిధి ఉందా లేదా అన్న చర్చ కూడా జరుగుతోంది. ఇవన్నీ చట్టంలో, న్యాయంలో ఇమిడి ఉన్న ధర్మ సూక్ష్మాలు. ఇవి ఎప్పుడో ఒకప్పుడు తేలుతాయి. అంతకు మించిన వ్యవహారం ఏమిటంటే రాహుల్ గాంధీ "నరేంద్ర మోదీతో పాటు నీరవ్ మోదీ, లలిత్ మోదీ" లాంటి వారి పేర్లు ఏకరువు పెట్టి ఈ ఇంటి పేరున్నవారు అందరూ దొంగలుగా ఎందుకుంటారు అనడం పరువు నష్టం కిందకు వస్తుందా లేదా అన్నది పెద్ద ప్రశ్న. ఒక కులాన్నో, వర్గాన్నో, మతాన్నో, ఒక వృత్తిలో ఉన్న వారినో కట్టగట్టి పరువుకు భంగం కలిగించే మాట అంటే అది సామూహిక వ్యవహారం కనక ఆ సమూహానికి చెందిన వ్యక్తి తన పరువుకు భంగం కలిగిందని వాదించడం సబబేనా, ఈ అంశంపై కోర్టు విచారణ చేపట్టవచ్చునా అన్న ప్రశ్నలూ చర్చలో ఉన్నాయి. ఒక సమూహాన్ని ఉద్దేశించి అమర్యాదకరంగా మాట్లాడినప్పుడు ఆ సమూహానికి చెందిన ఒక వ్యక్తి ఆ మాటలవల్ల తన పరువుకు నష్టం కల్గిందని వాదించడం కుదరదని అంటున్న న్యాయకోవిదులూ ఉన్నారు. కానీ సూరత్‌లో విచారణ పూర్తి అయింది. రాహుల్ గాంధీని దోషిగా తేల్చారు. ఇందులోనూ ఓ మతలబు ఉంది. ఈ కేసు దాఖలు చేసిన పూర్ణేశ్ మోదీ మాజీ మంత్రి. ప్రస్తుతం శాసనసభ్యుడు. కానీ సమూహాన్ని ఉద్దేశించి పరువుకు నష్టం కలిగించే మాటలు అన్నప్పుడు ఆ సమూహంలోని ఒక వ్యక్తి తన పరువుకు భంగం కల్గిందని వాదించడం కుదరదనుకున్నప్పుడు ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఈ కేసును విచారణకు చేపట్టనే కూడదు. చేపట్టారంటే కారణం ఏదో ఉంటుంది. అది సహేతుకమైందో కాదో హై కోర్టులో, అక్కడా కుదరకపోతే సుప్రీంకోర్టులో తేలుతుంది. మరో విచిత్రం ఏంటంటే రాహుల్‌పై కేసుదాఖలు చేసిన పూర్ణేశ్ మోదీ ఈ కేసు విచారణను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. ఆ తరవాత ఇటీవలే ఆయన ఈ స్టే తొలగించాలని కోరారు. హైకోర్టు అలాగే విచారణకు అనుమతించింది. ఆఘమేఘాలమీద విచారణ పూర్తిఅయింది. ఇందులోనూ ఏదో మర్మం ఉందేమో!

న్యాయపరమైన ఈ మీమాంస ఎలా ఉన్నా ఒకకేసులో నేరం చేసినట్టు రుజువైతే వెంటనే శాసనసభ సభ్యత్వమో, పార్లమెంటు సభ్యత్వమో రద్దయిన ప్రముఖులు లెక్కలేనంతమంది ఉన్నారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత, బీహార్ మాజీ ముఖ్య మంత్రి లాలూప్రసాద్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు ఆజం ఖాన్, కుల్దీప్ సింగ్ సెనెగర్ లాంటి ప్రముఖులు నేరస్థులని తేలిన వెంటనే వారి శాసనసభ్యత్వమో, పార్లమెంటు సభ్యత్వమో కోల్పోయారు. ఈ దృష్టితో చూస్తే రాహుల్‌గాంధీని లోక్‌సభ సభ్యుడిగా అనర్హుడుగా ప్రకటించడంలో తప్పేముంది, లేదా ఆశ్చర్య పోవలసింది ఏముంది అని అనుకోవచ్చు. కానీ నేరం రుజువైన తర్వాత చట్టసభల సభ్యులుగా ఉండడానికి అర్హత కోల్పోయినవారి గురించి పెద్ద చర్చ జరగలేదు. కానీ రాహుల్ గాంధీ మీద మోదీ ప్రభుత్వం కక్షగట్టినట్టు ప్రవర్తిస్తోందిగనక ఇప్పుడు ఈ అంశం విస్తృతంగా చర్చనీయాంశం అయింది. చట్టరీత్యా, లేదా కోర్టు తీర్పు రీత్యా రాహుల్ నేరస్థుడా కాదా అన్న విషయం మీదికన్నా రాహుల్ వ్యవహారాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగించు కుంటున్నారన్న అభిప్రాయమే సర్వత్రావుంది. నిజానికి రాహుల్ గాంధీ ఏ దృష్టితో చూసినా మోదీకి సరితూగే నాయకుడు కాకపోవచ్చు. కానీ ఒక మేరకు రాహుల్‌కు విదూషకుడి లక్షణా లున్నాయని బీజేపీ నేతల అంచనా. అందుకే రాహుల్ గాంధీ లాంటి వారు ప్రధాన ప్రత్యర్థిగా ఉంటేనే తనకు మేలు అని మోదీ ఎప్పటినుంచో భావిస్తున్నారు. ఇప్పుడు పరువునష్టం కేసులో శిక్ష పడింది కనక, ఆ శిక్ష ఆధారంగా లోక్‌సభ సభ్యుడిగా అనర్హుడిగా ప్రకటించే అవకాశం ఉంది కనక వివిధ స్థాయిల్లో ఉన్న మోదీ అనుయాయులు చెకచెకా కదిలి కాగలకార్యం సాధించిపెట్టారు. రాహుల్ వ్యవహారంలో చట్టాన్నీ తెగలాగారు. ప్రతి అంశాన్ని రాజకీయకక్ష సాధించడానికి సాధనంగా మలుచుకున్నారు. నిజానికి రాహుల్ గాంధీ అనర్హతను తేల్చాల్సింది రాష్ట్రపతి అని, అంతకు ముందు రాష్ట్రపతి ఎన్నికల కమిషన్ అభిప్రాయం తెలుసుకోవాలని నియమ నిబంధనలు ఏకరువుపెడ్తున్న వారికి కొదవలేదు. కానీ మోదీ హయాంలో ఆయన ఉద్దేశం, లక్ష్యమే ప్రధానం. చట్టంపేర సంకుచిత రాజకీయాలకు ధర్మం బలైంది.

నేను బతికే ఉన్నాను...

అవును. నేను బతికే ఉన్నాను. మీరూ బతికే ఉన్నారు. కాకపోతే మనం బతికి ఉన్నట్లు సాక్ష్యాలు మనమే చూపించాలి ఈ మాయదారి లోకానికి. అది కూడా ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడో, ఎదురుపడో కాదు.. అచ్చంగా మనకు మనమే వీడియోతీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయించాలి. అలా చేయకపోతే ఈ సోషల్ మీడియా మిమ్మల్ని చంపేస్తుంది. మీ ఆధార్ కార్డు చింపేస్తుంది. రేషన్ కార్డులో మీ పేరు డిలీట్ అయిపోతుంది. ఓటర్‌లిస్టులో మీ ఐడీ గల్లంతవుతుంది. అంతేకాదు దూరంగా ఉన్న మీ బంధువులకు కబురు వెళ్లిపోతుంది. ఈ మరణవార్త విని వాళ్లంతా ఆఘమేఘాల మీద శరీరానికి రెక్కలు తొడుక్కుని వాలిపోతారు. అవును, మీరు బతికే ఉన్నారని వారానికో, నెలకో, ఆరు నెలలకో, కనీసం సంవత్సరానికి ఒక సారైనా సెల్ఫీ వీడియోతో ప్రపంచం ముందుకు రావాలి. వివిధ రంగాల్లో ఉన్నవారైతే మరీ ముఖ్యంగా "నేను బతికే ఉన్నాను" అనే వీడియోని తరచుగా అందరికీ పంచాలి. చావు అందరికీ సమానమే అయినా...చావు అందరినీ సమానంగా చూడదు అంటాడు ఓ కవి. మనుషులు అందరికీ సమానమే అయినా... మనుషులందరినీ ఈ సోషల్ మీడియా సమానంగా చూడదు.

ఆరోగ్యం బాగుండాలంటే ప్రతి రోజూ జ్యూస్ తాగాలి. ఇది పాత మాట. ఈ సోషల్ మీడియా తరంలో మాత్రం వ్యూస్ తాగాలి. లెక్కకు మిక్కిలిగా లైక్‌లు కొట్టాలి. ఒక్క లైక్ కూడా కనిపించలేదా... ఈ రోజు ఏమైంది ఈ సోషల్ మీడియాకి. చుట్టూ పొగ కమ్మేసినట్లుగా ఉండాల్సిన సోషల్ మీడియాకి ఏమైంది. ఇక ఎవరో ఒకరుకాదు...వందల మంది కామెంట్లు చేయాలి. నువ్వు సూపరేహ అనాలి...అథమ పక్షం నువ్వు పనికిరావు అనైనా కామెంటించాలి. లేకపోతే తిండి ఉండదు. నిద్ర పట్టదు. జీవితం ముగిసిపోయినట్లుగా భ్రాంతి కలుగుతుంది.

మీడియా సోషల్ అయిన తర్వాత వ్యక్తి ఉనికి ఆ వ్యక్తిది కాకుండా పోయింది. మనుషుల చావు, బతుకులు వారి చేతివేళ్ల సందుల్లోంచి

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

జారిపోయి సోషల్‌మీడియా చేతుల్లోకి వెళ్లిపోతాయి. రెండు రోజుల క్రితం అదే జరిగింది. సంవత్సరం క్రితం కూడా అదే జరిగింది. అంతకు ముందు చాలాసార్లే జరిగింది. వర్తమానంలో ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంటుంది. భవిష్యత్‌లో జరగదనే నమ్మికకూడా లేకుండా పోతుంది. ఓ గొప్ప నటుడ్ని సోషల్‌మీడియా నిర్దయగా చంపేసింది. ఆ నటుడు నేను బతికే ఉన్నాను బాబో అని తన వీడియోతో ప్రపంచం ముందుకు రావాల్సివచ్చింది. గతేడాది ఒకప్పటి హీరో, తర్వాత కమెడియన్, నేటి క్యారెక్టర్ ఆర్టిస్టుకి ఈ సోషల్ మీడియా శ్రద్ధాంజలి చెప్పేసింది. ఆ నటుడి కూతురు బెంబేలెత్తిపోయి హడావుడిగా అమెరికా నుంచి వచ్చేసింది. ఈ మధ్యనే ఓ నటి వ్యక్తిగత జీవితాన్ని బజారులోకి తీసుకొచ్చేసింది. ఆమె పాపం... నేను, నా భర్త, పిల్లలు కలిసే ఉన్నామంటూ భోరున విలపించింది. కన్నీళ్లతో ఊరుకోలేదు. తనను మానసికంగా ఇబ్బంది పెట్టిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిని కూడా సోషల్ మీడియా వైరల్ చేసింది.

యూట్యూట్ చానల్స్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్ వంటివి విచ్చలవిడిగా పెరిగిపోయిన పాప ఫలితం అందరూ తలో కొంతా అనుభవిస్తున్నారు. ఒకప్పుడు మీరు జర్నలిస్టా అని కాసింత గౌరవంగా, భయంగా అడిగిన వారు ఈ యూట్యూబ్ చానెల్స్ వచ్చిన తర్వాత ఓ చూడరాని మనిషినో, చూడకూడని వ్యక్తినో, ఇతగాడు కనిపించేదేమిటి భగవంతుడా అనో అనుకుంటున్నారు. ఇది కూడా లోలోపల కాదు.... బహిరంగంగానే తమ అసహ్యాన్ని బయట పెట్టేస్తున్నారు. ఎవరి పరువైనా తీసేయడానికో, కుటుంబాన్ని వీధుల పాలు చేయడానికో ఈ సోషల్ మీడియాకి ఏమంత కష్టం కాదు. "వ్యక్తుల బతుకులు వారి వారి సొంతం... పబ్లిక్‌లో నిలబడితే ఏమైనా అంటాం" అని శ్రీశ్రీ అన్నారు. దానికి అర్థం మార్చేసిన ఈ సోషల్ మీడియా "వ్యక్తుల బతుకులు మా సొంతం. పబ్లిక్ గానే కాదు మీ ప్రయివేట్ బతుకుల గురించి మేమైనా అంటాం" అంటూ చెలరేగిపోతున్నారు. ఒక్క స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు, నీకు వీడియో తీయడం వస్తే చాలు, అలా తీసిన వీడియోకి రెండు మాటలు తగిలించి ప్రపంచం మీదకి వదిలేస్తారు. మనం చేసింది మంచా, చెడా, మంచికి చెడు చేస్తుందా... చెడుకు మంచి అవుతుందా... దీని వల్ల ఎవరు లాభపడతారు... ఎవరు నష్టపోతారు... ఎవరు గాయ పడతారు... ఇంకెవ్వరు విలవిల్లాడతారు... మరెవ్వరు వీధిని పడతారు అన్న ఎరుక ఉండదు. తీసామా... పంపించామా... వ్యూస్ వచ్చాయా... ఇదొక్కటే సోషల్ మీడియా ముందున్న లక్ష్యం. నేను హైదరాబాద్‌లో జర్నలిస్టుగా ఉన్న సమయంలో ఐఏఎస్ అధికారి విలేకరుల సమావేశంకాని, మరొక సమావేశం కాని ఏర్పాటు చేస్తే దానికి ఎవరైనా జర్నలిస్టు హాజరు కాకపోతే ఆ మర్నాడు "మీరు నిన్న రాలేదేం" అని అడిగేవారు ఆ జర్నలిస్టుని. ఇప్పుడు అదే ఐఏఎస్ అధికారి ఏదైనా కార్యక్రమంలో జర్నలిస్టుని చూస్తే "వీళ్లెందుకు వచ్చారు. మనం పిలవలేదుగా" అని వాళ్ల ముందే అంటున్నారు. ఇదీ సోషల్ మీడియా, యూట్యూబ్ చానెల్స్ తెచ్చిన ఘనత. పెరుగుట విరుగుట కొరకే..ఓ సామెత...పెరిగింది. విపరీతంగా... విస్తృతంగా, విచ్చలవిడిగా... ఇక మిగిలింది విరుగుట మాత్రమే. ఇది కూడా జరుగుతుంది. కాసింత అలస్యం కావచ్చు. అందాకా వేచి చూడాల్సింది.

సెల్: 99120 19929

దిగజారుతున్న పార్లమెంటు ప్రతిష్ఠ

టి.వి.సుబ్బయ్య

ఏకపక్షంగా పదినిముషాలు కూడా చర్చలు లేకుండా మంది బలం ఉందని చట్టాలు చేయడం ప్రజాస్వామ్య లక్షణమా? నిరంకుశత్వమా? మాట్లాడేందుకు అనుమతించకపోవడం, ప్రభుత్వంపై విమర్శలను రికార్డుల నుండి తొలగించడం ఎలాంటి ప్రజాస్వామ్యం? మొదటి మూడు లోక్‌సభలు సగటున ఏడాదికి 120 రోజులు సమావేశమయ్యాయి. ప్రతిపక్షాలు విపులంగా మాట్లాడేందుకు, వారు చెప్పే సూచనలు తీసుకోవడం మొదటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ ప్రభుత్వ హయాంలో జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ విషయంలో ఎలా వ్యవహరిస్తున్నది బహిరంగ రహస్యమే.

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకత్వంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పార్లమెంటు ప్రతిష్ఠ దిగజారిపోతోందని అనేక సంఘటనలు స్పష్టం చేస్తాయి. దేశ ప్రజలందరిపై ప్రభావంచూపే అనేక నిర్ణయాలపై పార్లమెంటులో సమగ్రమైన చర్చ జరగకుండానే మోదీ ఏకపక్ష నిర్ణయాలను ప్రజలపై రుద్దుతున్నారు. కశ్మీరు ప్రత్యేక ప్రతిపత్తిని నిర్వీర్యం చేయడంలోగానీ, వ్యవసాయ చట్టాలు చేయడం, కార్మిక కోడ్లను కుదించి పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరించడం, పెద్దనోట్ల రద్దు తదితర కీలక అంశాలపై చర్చలు లేవు. బడ్జెట్ రెండో విడత సమావేశాలు ప్రారంభమయ్యాక ఏ అంశంపైనా అరగంటకూడా చర్చలు జరగలేదు. ఫిబ్రవరి మొదటివారంలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నాటి నుండి అదానీ కుంభకోణంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీని (జెపిసి) వేసి నిజం నిగ్గుతేల్చాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఖాతరు చేయడంలేదు. ప్రభుత్వం తనకు అవసరమైన బిల్లులను ఆమోదింపజేసుకోవడానికే పార్లమెంట్ సమావేశాలను నిర్వహిస్తున్నారన్న అభిప్రాయం ఏర్పడింది. బడ్జెట్‌ను, ఆర్థిక బిల్లును 12 నిముషాల్లో చర్చలేకుండా ఆమోదించటం అత్యంత విచారకరం. సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపైన మోదీ ప్రభుత్వహయాంలో లోక్‌సభ చర్చించిన దాఖలాలేదు. ప్రధాని మోదీ పార్లమెంట్ సమావేశాలకు హాజరై చర్చల్లో పాల్గొనడం అరుదు. ఈ సమావేశాల్లో అదానీ కుంభకోణం, రాహుల్‌గాంధీ లండన్ పర్యటనలో దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని దేశ ప్రతిష్ఠను దెబ్బ తీశారన్న ఆరోపణల అంశాలే ప్రధానమయ్యాయి. జెపిసిని తొలి నుంచి మోదీ ప్రభుత్వం తిరస్కరిస్తోంది. అంబానీ కుంభకోణం బ్యాంకులను, ఎల్‌ఐసి తదితర ఆర్థిక సంస్థలను ప్రత్యక్షంగా, డిపాజిట్‌దారులను పరోక్షంగా లక్షల కోట్లు నష్టపరిచినా మోదీ ప్రభుత్వం చలించకపోవడం ప్రజలంటే లెక్కలేకపోవడమని భావించవలసి వస్తోంది.

అదానీకి, మోదీకి మధ్యగల విడదీయలేని స్నేహం 2014 లో అధికారానికి రాకముందు ఎన్నికల ప్రచారానికి ప్రత్యేక విమానాన్ని మోదీకి అదానీ సమకూర్చారన్న వార్తలు వెల్లడించాయి. మోదీ ప్రభుత్వహయాంలో అదానీ అనేక అవకతవకలకు పాల్పడి ప్రపంచ కుబేరులలో మూడవస్థానం దక్కించుకున్నారన్న వార్త వెలువడిన కొద్దిరోజులకే అమెరికాకు చెందిన ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు సంస్థ హిండెన్‌బర్గ్ అదానీ ఆర్థిక కుంభకోణాన్ని వెల్లడించింది. అదానీని కాపాడేందుకే చర్చలకు మోదీ ప్రభుత్వం అంగీకరించడం లేదనేది స్పష్టం. చర్చ జరిగితే మోదీ అండదండలు అదానీకి ఉన్నాయన్న అంశం రుజువు కావచ్చు.

అమెరికా విమర్శలు

భారతదేశంలో పత్రికా స్వేచ్ఛకు ముప్పు వాటిల్లిందని మత, జాతిపరమైన మైనారిటీలపై దాడులు పెరిగాయని, భారీగా మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని అమెరికా విదేశాంగశాఖ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2022 నాటి నివేదికను కాంగ్రెస్‌కు (పార్లమెంట్) సమర్పించింది. విదేశాంగశాఖ పరిధిలో పనిచేసే 'బ్యూరో ఆఫ్ డెమెక్రసి, హ్యూమన్ రైట్స్ అండ్ లేబర్' నివేదికను రూపొందించింది. ఈ అంశాలపై ఈ నివేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పోలీసులు జైలు అధికారులు, ఖైదీలు, నిందితులను క్రూరంగా హింసిస్తున్నారని, అమానుషంగా వ్యవహరిస్తున్నారని, జైళ్లలో ప్రాణాంతక పరిస్థితులు నెలకొన్నాయని తెలిపింది. అమెరికాకు చెందిన ఈ నివేదికను అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ విడుదల చేశారు. ఇంటర్నెట్‌పై ఆంక్షలున్నాయని, నిరసన ప్రదర్శనలకు అనుమతించడంలేదని, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలను వేధిస్తున్నారని వ్యక్తుల గోప్యతకు భంగంకలిగే లాగా చట్ట విరుద్ధంగా ప్రైవేటు సంభాషణలు వింటున్న సంఘటనలు జరుగుతున్నాయని ఈ నివేదిక పేర్కొంది. గతంలోనూ అమెరికాతో పాటు అక్కడి ఫ్రీడం హౌస్ ఇలాంటి నివేదికలు విడుదల చేశాయి. నివేదికలు వెల్లడించిన అంశాలను పరిశీలించి దిద్దుబాటు చర్యలు తీసుకొనేందుకు పాలకులు సిద్ధంగా లేరు. పైగా విదేశీ నివేదికలను నమ్మవలసిన పనిలేదని తృణీకరించారు. ముమ్మర చర్చలకు పార్లమెంట్ ధారాళ చట్రం అనేక అవకాశాలు కల్పించింది. తీవ్ర చర్చలు జరపవచ్చు. నిరసన తెలియజేయవచ్చు. ఆయా సమస్యలపై వాదోపవాదాలు జరుగుతాయి. ప్రశ్నోత్తరాల సమయం, స్వల్పకాలిక చర్చలు, వాయిదా తీర్మానాలు తదితర నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. ప్రభుత్వ జవాబుదారీని ప్రశ్నించవచ్చు. ఇన్ని అవకాశాలు సభ కార్యకలాపాల నియమనిబంధనలు సమకూర్చినప్పటికీ ప్రభుత్వానికి ఇవి స్మరణకు రావడంలేదు. సభ గందరగోళంగా తయారు కావడానికి ప్రభుత్వం ఎక్కువసార్లు కారణమవుతోంది. చర్చలు లేకుండానే పార్లమెంట్ చట్టాలు చేస్తున్నదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

ఏకపక్షంగా పదినిముషాలు కూడా చర్చలు లేకుండా మంది బలం ఉందని చట్టాలు చేయడం ప్రజాస్వామ్య లక్షణమా? నిరంకుశత్వమా? మాట్లాడేందుకు అనుమతించకపోవడం, ప్రభుత్వంపై విమర్శలను రికార్డుల నుండి తొలగించడం ఎలాంటి ప్రజాస్వామ్యం? మొదటి మూడు లోక్‌సభలు సగటున ఏడాదికి 120 రోజులు సమావేశమయ్యాయి. ప్రతిపక్షాలు విపులంగా మాట్లాడేందుకు, వారు చెప్పే సూచనలు తీసుకోవడం మొదటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ ప్రభుత్వ హయాంలో జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ విషయంలో ఎలా వ్యవహరిస్తున్నది బహిరంగ రహస్యమే. లోక్‌సభ 120 రోజులు, రాజ్యసభ 100రోజులు సమావేశం కావాలని రాజ్యాంగం పనితీరుపై సమీక్షించే కమిషన్ సిఫారసు చేసింది. పార్లమెంట్ సమావేశం అయినప్పుడు నిమిషానికి దాదాపు 2.5 లక్షల రూపాయలు ఖర్చవుతుంది. అంటే రోజుకు కొన్ని కోట్లు అవుతుంది. మోదీప్రభుత్వంలో లక్షల కోట్లు ప్రజాధనం వృథా అవుతోందని భావించవచ్చు.

విధిగా చర్చలు జరగడానికి, కమిషన్ సిఫారసు చేసినన్ని రోజులు సమావేశాలు జరగడానికి, చర్చల్లో సభ్యులు పాల్గొనేందుకు వీలు కల్పించేందుకు కట్టుదిట్టమైన చట్టం అవసరంఉంది. అయితే ఎన్ని కట్టుదిట్టాలున్నా నేటి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడానికి అడ్డంకి కాబోవని ఇప్పటి వరకు జరిగిన మోదీ పాలన అనుభవం తెలియజేస్తోంది. ఈ పరిస్థితులను మార్చుకొనే అవకాశం ప్రజల చేతుల్లోనే ఉంది.

ఓటర్లయినా మారాలి

ఇటీవల కాలంలో భారతదేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతున్న సూచనలు గోచరిస్తున్నాయి. ఇందుకు ఎవరు బాధ్యులు? ప్రజలెన్నుకున్న ప్రతినిధులా? ఓటు హక్కుకు వెలకట్టి కొంటున్న రాజకీయ పక్షాలా? ప్రజలా? ప్రజలెన్నుకున్న ప్రతినిధుల బాధ్యత ఏమిటి? ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు ఎందుకు వైఫల్యం చెందుతున్నారు? ప్రజా ప్రతినిధులు ప్రజలకు కాకుండా తమకు టిక్కెట్టిచ్చిన రాజకీయ పార్టీలకు బాధ్యత వహించడం ప్రజాస్వామ్యంలో చోటు చేసుకుంటున్న ఒక విపరీత పరిణామం. భారత దేశం ప్రపంచంలో రెండవపెద్ద జనాభాగల దేశం. భిన్న మతాలతో, విభిన్న కులాలతో, సంస్కృతులతో ప్రత్యేకతను సంతరించుకున్న దేశానికి నియంతృత్వం, అధ్యక్షతరహా పాలన సరికాదని ఆనాడే రాజనీతిజ్ఞులు భావించారు. ప్రజాస్వామ్య విధానమే శ్రేయస్కరమని, ప్రజాస్వామ్య వ్యవస్థలోనే అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం జరుగుతుందని భావించారు. ప్రజాభీష్టం ప్రకారమే పాలన జరగాలని, ప్రజలెన్నుకున్న ప్రతినిధుల ద్వారానే ప్రజలకు మేలు జరుగుతుందని, అందుకు ప్రజాస్వామ్యమే సరైనదని భావించారు. ఓటుహక్కు గల యువత ఆలోచనలు,పెద్దల అనుభవాలు ప్రజాస్వామ్యం పదికాలాలు వర్ధిల్లడానికి ఆస్కారం ఏర్పడుతుందని మేధావుల భావన. 18 సంవత్సరాల వయసు నిండిన వారంతా తమ ఓటు హక్కును నిస్సంకోచంగా నిర్భీతిగా వినియోగించుకోవచ్చు.

నేటి మన ప్రజాస్వామ్య వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలు ప్రజాస్వామ్యంపై ప్రజలకున్న నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాయి. ఎన్నికల్లో ధనం,కులం,మతం,మద్యం,కండబలం ప్రజాస్వామ్యాన్ని శాసించడం దురదృష్టకరం. ఎన్నికల్లో గెలవడానికి రాజకీయ పక్షాలన్నీ అడ్డదార్లు తొక్కుతున్నాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిహాసప్రాయం చేస్తున్నాయి. ఓటరుకూడా ధన ప్రభావానికి లోనౌతున్నాడు. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి ఓటుహక్కును దుర్వినియోగం చేయడం జరుగుతున్నది. ధనానికి లొంగిపోయిన వ్యక్తులు ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కును కోల్పోయినట్టే. ప్రజలు రాజకీయ పార్టీలిచ్చే డబ్బుకు, మద్యానికి లొంగిపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకది మాయని మచ్చ. డా.బిఆర్ అంబేద్కర్ మాటల్లో చెప్పాలంటే ఓటు అనేది ప్రజల చేతుల్లో ఒక ఆయుధం. ఓటును అమ్ముకుని జీవితాలను నాశనం చేసుకుంటారో, ఓటు విలువ గుర్తించి, తమను తాము బాగు చేసుకుంటారో ఓటర్ల విజ్ఞతపైనే ఆధారపడి ఉంటుంది.

ఎన్నికల ముందు రాజకీయపక్షాలు ఎరగావేసే తాయిలాల వలలో చిక్కి సామాన్య ఓటరు మోసపోతున్నాడు. ఆ విషయం ఓటరుకు కూడా తెలుసు? ఓటరు బలహీనత, సెంటిమెంట్లు రాజకీయ పక్షాలకు వరం.ఓటరులో చైతన్యం ఉన్నా రాజకీయ పార్టీల వ్యూహాత్మక ఎన్నికల పాచికల్లో ఓడిపోయి, పూచిక పుల్లలా పరిగణించటం, ఎన్నికల తర్వాత కూరలో కరివేపలా తృణీకరించటం ప్రజాస్వామ్య మనుగడకు విఘాతం. ఓటరులో వివేకం కలగాలి. ఎన్నికల సంఘం కూడా నిష్పాక్షికంగా వ్యవహరించాలి. ఎన్నికల వ్యవస్థలో సమూలమార్పులు రావాలి. పటిష్ఠమైన ఎన్నికల సంస్కరణలు జరగాలి. ఇటీవల భారతదేశ అత్యున్నత న్యాయస్థానం కూడా ఎన్నికల సంఘం పనితీరుపై అసంతృప్తి వ్యక్తంచేసిన విషయం విదితమే. ఎన్నికల సంఘం అధికార పార్టీల కనుసన్నల్లో పనిచేయడం పట్ల అభ్యంతరం వ్యక్తంచేస్తూ, ప్రధాన ఎన్నికల కమీషనర్ నియామకం విషయంలో ప్రధాని, ప్రతిపక్షనాయకుడు, సి.జె.ఐ ల ప్రమేయం ఉండాలని, ఏకపక్ష నియామకం కుదరదని పేర్కొనడం గమనించదగ్గ విషయం. టి.ఎన్.శేషన్‌లా నిష్పక్షపాతంగా వ్యవహరించే వ్యక్తులే ఎన్నికల నిర్వహణకు సారథ్యం వహించాలి.

ఎన్నికలముందు రాజకీయ పార్టీలు ఎలాంటి వాగ్దానాలు చేయకుండా నిలువరించాలి. వాగ్దానాలవలనే ప్రజాస్వామ్యవ్యవస్థ దెబ్బతింటున్నది. అధికారంలోకి వచ్చిన తర్వాతే రాజకీయ పార్టీలు ప్రజలకు ఏమి చేయగలుగుతారో అవి చేయాలి. ఎన్నికల ముందు చేసే వాగ్దానాల వల్ల ఓటరు ఒక రకమైన సందిగ్ధావస్థకు గురై, ఓటు హక్కును వినియోగించుకోలేక పోతున్నాడు. రాజకీయ ప్రలోభాలు,వత్తిళ్ళు ఓటరును అయోమయానికి గురిచేస్తున్నాయి. ఇకనైనా ప్రజలు మారాలి. పార్టీల కతీతంగా నిస్వార్థపరులను, మచ్చలేని మేధావులను ఎన్నికల్లో గెలిపించాలి. అదే నిజమైన ప్రజాస్వామ్య విజయం.

- సుంకవల్లి సత్తిరాజు, సెల్: 9704903463

కోవిడ్ కేసుల కలకలం

డాక్టర్ జ్ఞాన్‌పాఠక్



కొత్త రకం వైరస్ ఎక్స్‌బీబీ.1.16 కారణంగా దేశంలో కొత్తగా కోవిడ్-19 కేసులు పెరుగు తున్నాయి. ఇది అత్యంత ఆందోళనకరమైన అంశం. గత 140 రోజులలో ఒకేరోజు మార్చి 23వ తేదీన 1,300 కోవిడ్-19 కొత్త కేసులు నమోదయ్యాయి. ఈ కొత్త వైరస్ ప్రభావం ప్రజల్లో అనారోగ్యం, ఆసుపత్రిలో చేరడం మినహాయించి మరణాలకు కారణం కానంత వరకు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు పేర్కొన్నారు. దేశంలో కోవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 7,605కి పెరిగిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ గణాంకాలు వెల్లడించాయి. తాజాగా మంగళవారం నమోదైన మూడు మరణాలతో, మొత్తం దేశంలో మరణాల సంఖ్య 5,30,816 కు చేరుకుంది. కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రల్లో కొవిడ్-19 మరణాలు నమోదయ్యాయి. మొత్తం కోవిడ్-19 సంఖ్య తాజాగా 4,46,99,418కి చేరుకుంది. వీక్లీ పాజిటివిటీ రేటు 1.08 శాతంగా ఉన్నప్పటికీ, రోజువారీ నమోదైన కేసుల సంఖ్య రేటు 1.46 శాతానికి పెరిగింది. జాతీయ రికవరీ రేటు 98.79 శాతంగా ఉంది. దేశంలో పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు లేకపోవటం వలన ఈ ముప్పు ఏర్పడుతోంది. తాజాగా ఇన్‌ఫ్లుయంజా (హెచ్3ఎన్2) కేసులు కూడా పెరుగుతున్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. ఈ పరిస్థితి కొంచెం ఆందోళనకరం గానే ఉంది. గత 24 గంటల్లో 89,078 పరీక్షలు చేపట్టగా, ఇప్పటివరకు 92.06 కోట్ల కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 220.65 కోట్ల డోస్‌ల వ్యాక్సిన్‌లు వేయడమైంది. దేశంలో పెరుగుతున్న కోవిడ్-19 పరిస్థితిని సమీక్షించ డానికి, పెరుగుతున్న ఇన్‌ఫ్లుయంజాపై ప్రధాని మోదీ తాజాగా ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దేశంలో ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దేశంలో కొంతకాలంగా కోవిడ్-19 కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో కేసులను గుర్తించే పరీక్షలస్థాయి రోజుకు 90,000 కంటే తక్కువకు పడిపోయింది. ఈ పరిస్థితిలో, జీనోమ్ సీక్వెన్సింగ్‌ను పెంచవలసిన అవసరం ఉంది. తీవ్ర శ్వాసకోస అనారోగ్యంకేసులకు సంబంధించిన తగిన పరీక్షలను ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరం ఉంది. 2020లో కోవిడ్-19 మొదటి, 2021 మధ్య కాలంలో నెలకొన్న రెండవ దశలో, దేశంలోని ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య సౌకర్యాల ఏర్పాట్లు మెరుగుపడ్డాయి. అయితే కొవిడ్-19 తగ్గుముఖం పట్టడంతో ఆసుపత్రులలో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను కూడా తగ్గించడమైంది. అయితే తాజాగా కొత్త కేసుల సంఖ్య పెరగడంతో ఆసుపత్రి అవసరాలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ప్రధాని నిర్వహించిన తాజా సమీక్షా సమావేశంలో ఆసుపత్రులలో తగిన చికిత్సాకేంద్రాలను నిర్వహించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖను ప్రధాని ఆదేశించారు. కోవిడ్-19 మహమ్మారి సమస్య ముగిసిపోలేదని, దేశవ్యాప్తంగా కొవిడ్ స్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని అధికారులకు గుర్తు చేశారు.

కరోనా మహమ్మారిని ఎదుర్కోవడానికి గతంలో అనుసరించిన 'టెస్ట్-ట్రాక్-ట్రీట్-టీకా' కార్యక్రమం ఇప్పటికీ అనుసరణీయమే. అయితే కేసులను పరీక్షించడం, పరిశుభ్రత, ప్రమాణాల నిర్వహణ వంటి వాటిపై మరింత దృష్టి కేంద్రీకరించవలసిన అవసరం ఉంది. చైనా, సింగపూర్, హాంకాంగ్, థాయిలాండ్, జపాన్ వంటి ఆసియా దేశాల్లో కొత్తగా కొవిడ్-19 కేసులు నమోదవుతున్నాయి. ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 22,000 ఆసుపత్రులలో ప్రయోగాత్మక చికిత్సా సౌకర్యాల ఏర్పాట్లు జరిగాయి. అయితే గత 30 రోజులుగా దేశంలో పెరుగుతున్న కేసుల దృష్ట్యా మరింత కసరత్తులు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఫిబ్రవరి మధ్యలో దేశంలో కేవలం 1000 కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఇది 30 రోజుల్లో 3 రెట్లు పెరిగి మార్చి మధ్యలో వారానికి 3000 కేసులకు చేరుకుంది.

దేశంలో మార్చి రెండవ వారం నాటికి, ఐసిఎమ్‌ఆర్ గణాంకాల ప్రకారం, ఇన్‌ఫ్లుయంజా వంటివి 48 శాతం నమోదుకాగా, 33.3 శాతం కొవిడ్-19 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఈ ముప్పు నుండి దేశం తనను తాను రక్షించుకోవలసిన అవసరం ఉంది. అయితే భయపడాల్సిన అవసరం లేదు, ఎందుకంటే కొత్త వేరియంట్లు పుట్టుకొస్తూనే ఉంటాయిని ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా సూచించారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

- బీజేపీ నియంతృత్వానికి ఇక తెర
- రాహుల్‌పై అనర్హత... విపక్షాల ఆగ్రహం

న్యూదిల్లీ: మోదీ ఇంటి పేరు కలవారందరూ దొంగలే అంటూ వ్యాఖ్యానించి రెండేళ్ల జైలుశిక్షకు గురైన కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్‌గాంధీపై అనర్హత వేటు పడటంపై కాంగ్రెస్ పార్టీ నేతలతో పాటు ఇతర పార్టీల నాయకులు మండిపడ్డారు. బీజేపీ నియంతృత్వ ధోరణిని ఎండగట్టారు. ప్రత్యర్థులపై మోదీ సర్కారు కక్ష సాధింపునకు పాల్పడుతోందని విమర్శలు గుప్పించారు. బీజేపీ నియంతృత్వ ముగింపునకు ఇది నాంది అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని కొంతమంది పేర్కొన్నారు.

నిజాలు మాట్లాడేవారి గొంతు నొక్కేందుకు బీజేపీ యత్నిస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అయినా తాము సత్యమే మాట్లాడతామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అవసరమైతే జైలుకు వెళ్తామని ఖర్గే చెప్పారు. అదానీపై ప్రశ్నించినందుకే రాహుల్‌పై వేటేశారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. దేశంలో కక్ష సాధింపు రాజకీయాలు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి మండిపడ్డారు. భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్‌కు ప్రజాదరణ పెరగడం వల్లే ఆయనపై వేటేశారని చెప్పారు. పార్లమెంట్ నుంచి తొలగించగలరు కానీ కోట్లాది మంది ప్రజల హృదయాల నుంచి రాహుల్‌ను తొలగించలేరని కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. రాహుల్‌పై వేటు రాజకీయ ప్రేరేపితమని, తొందరపాటు చర్య అని కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ అభిప్రాయపడ్డారు. రాహుల్ గొంతు నొక్కడానికి ప్రభుత్వం కొత్తదార్లు వెతుకుతోందని ఆయన ఆరోపించారు.

ప్రతిపక్ష నేతలను బీజేపీ లక్ష్యంగా చేసుకుందని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ప్రసంగాల ఆధారంగా అనర్హత వేటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని దిగజార్చారని మమత మండిపడ్డారు. మోదీ హయాంలో ప్రజాస్వామ్యం దిగజారిపోతోందని పేర్కొన్నారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రసంగాలు చేసినందుకే ప్రతిపక్ష నేతలు అనర్హతకు గురవుతున్నారని వ్యాఖ్యానించారు. 'ప్రధాని మోదీ నవభారతంలో ప్రతిపక్ష నాయకులు బీజేపీకి ప్రధాన లక్ష్యంగా మారారు. నేరప్రవృత్తి గల బీజేపీ నేతలను ఏకంగా కేబినెట్‌లోకే తీసుకుంటున్నారు' అని మమత ట్వీట్ చేశారు. దొంగ అన్నందుకు రాహుల్ సభ్యత్వం తొలగిస్తారా అని శివసేన ఉద్ధవ్ వర్గం అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఆగ్రహం వెలిబుచ్చారు. దేశంలో దొంగలు, దోపిడీదారులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని, వారిని శిక్షించకుండా రాహుల్‌ను శిక్షిస్తారా అని ఉద్ధవ్ ప్రశ్నించారు. దీన్ని ప్రజాస్వామ్య హత్యగా ఆయన అభివర్ణించారు. నియంతృత్వం ముగింపునకు ఇది ఆరంభ శూచిక అని ఉద్ధవ్ అభిప్రాయపడ్డారు. బీజేపీ పాలనలో అన్ని సంస్థలు ఒత్తిడికి గురవుతున్నాయని ఆరోపించారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా పాట్నాలోని విధానసభ ఆవరణలో పాలక మహాఘట్ బంధన్ సభ్యులు ఆందోళనకు దిగారు. అయితే, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ దీనికి దూరంగా ఉన్నారు. ఆర్‌జేడీ, కాంగ్రెస్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, సీపీఐ, సీపీఎం, మాజీ సీఎం జితన్‌రామ్ మాంజీ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు నిరసనలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలంతా తమ వాహనాలను గేటు వద్దే నిలిపి అసెంబ్లీ ద్వారం వరకు ప్రదర్శన చేశారు. మోదీ హటావో...దేశ్ బచావో వంటి నినాదాలు రాసిన ప్లకార్డులు ప్రదర్శించారు.

గతంలో ఇందిరాగాంధీపైనా ఇలాంటి చర్యలకే దిగారని, కానీ ఆమె గోడకు కొట్టిన బంతిలా అద్భుత విజయంతో మళ్లీ అధికారం చేపట్టారని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బాగెల్ గుర్తుచేశారు. బీజేపీ ఆటలు సాగనీయబోమని, మోదీ నియంతృత్వానికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు.

కోర్టు తీర్పు వల్లే...బీజేపీ

మరోవైపు, కోర్టు ఉత్తర్వుల ఫలితంగానే రాహుల్‌పై అనర్హత వేటు పడిందని బీజేపీ సమర్థించుకుంది. ఇది రాజకీయ ప్రేరేపితం కాదని తెలిపింది. చట్టం ముందు అందరూ సమానమేనని వ్యాఖ్యానించింది. చట్టప్రకారమే రాహుల్‌పై అనర్హత వేటు పడిందని కేంద్రమంత్రి ఎస్‌పీఎస్ బాఘెల్ చెప్పారు. క్రిమినల్ కేసులో శిక్షకు గురైన యూపీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యేపైనా అనర్హత వేటు పడిందని చెప్పుకొచ్చారు. కోర్టు తీర్పు ఆధారంగా రాహుల్‌పై అనర్హత వేటుపడిందని, కాంగ్రెస్ నేరుగా న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపించారు.

పరువు నష్టం కేసులో దోషిగా తేలిన తర్వాత

రాహుల్ లోక్‌సభకు హాజరు

న్యూదిల్లీ: 2019 క్రిమినల్ పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు తనను దోషిగా నిర్ధారించిన ఒక రోజు తర్వాత, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శుక్రవారం లోక్‌సభ కార్యక్రమాలకు హాజరయ్యారు. సభా కార్యక్రమాల ప్రారంభానికి ముందు రాహుల్ గాంధీ పార్టీ ఎంపీల సమావేశానికి హాజరయ్యారు. ఇందులో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ కూడా పాల్గొన్నారు. వివిధ అంశాలపై గందరగోళం నెలకొనడంతో సభ ప్రారంభమైన కొద్ది క్షణాలకే వాయిదా పడింది. ఆ తర్వాత రాహుల్ గాంధీ పార్లమెంటు నుంచి వెళ్లిపోయారు. 'దొంగలందరికీ మోదీని సాధారణ ఇంటిపేరుగా ఎలా పెట్టారు' అని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేష్ ఫిర్యాదుపై దాఖలు చేసిన ఈ కేసులో గుజరాత్‌లోని కోర్టు రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. భారత శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్లు 499, 500 కింద 52 ఏళ్ల రాహుల్ గాంధీని దోషిగా నిర్ధారించిన చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హెచ్‌హెచ్ వర్మ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. పై కోర్టులో అప్పీల్ చేసుకోవడానికి వీలుగా శిక్షను 30 రోజుల పాటు నిలిపివేసింది. అప్పీలేట్ కోర్టు శిక్షను సస్పెండ్ చేయడంతోపాటు రెండేళ్ల జైలు శిక్షను కూడా రద్దు చేస్తే రాహుల్ గాంధీ వెంటనే పార్లమెంటు సభ్యునిగా అనర్హత వేటు నుంచి తప్పించుకోవచ్చు.

లోక్‌సభలో ఆర్థిక బిల్లు ఆమోదం

64 అధికారిక సవరణలు

న్యూదిల్లీ: లోక్‌సభ శుక్రవారం 64 అధికారిక సవరణలతో ఆర్థిక బిల్లు 2023ని ఆమోదించింది. ఇందులో డెట్ మ్యూచువల్ ఫండ్స్‌కు చెందిన కొన్ని విభాగాలపై దీర్ఘకాలిక పన్ను ప్రయోజ నాలను ఉపసంహరించుకోవడం సహా జీఎస్‌టీ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయడం కోసం మరొకటి కోరింది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్స రానికి పన్ను ప్రతిపాదనలను అమలు చేసే ఆర్థిక బిల్లు అదానీ గ్రూప్ కంపెనీలపై వచ్చిన ఆరోపణలపై జేపీసీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ) విచారణకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యుల గందరగోళం మధ్య చర్చ లేకుండానే ఈ బిల్లు ఆమోదం పొందింది. బిల్లును ఆమోదం, పరిశీలన కోసం తీసుకువెళుతున్నప్పుడు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ సమస్యలను పరిశీలించడానికి ఆర్థిక కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మూలం వద్ద పన్ను నుంచి తప్పించుకునే విదేశీ పర్యటనల కోసం క్రెడిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులను భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) పరిశీలిస్తుందని కూడా ఆమె చెప్పారు. బడ్జెట్ ప్రతిపాదనలతో పాటు ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లుకు సీతారామన్ 64 అధికారిక సవరణలను ప్రవేశపెట్టారు. గురువారం బడ్జెట్‌ను ఆమోదించారు. ఆ సమయంలో కూడా నిరసన కారణంగా చర్చ జరగలేదు. సవరణల తరువాత, బిల్లుకు 20 కొత్త సెక్షన్లు జోడించారు. ఆర్థిక బిల్లును ఇప్పుడు రాజ్యసభకు పంపుతారు. బిల్లును సభ ప్రారంభిస్తున్నప్పుడు, అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ నివేదికను అనుసరించి అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీలపై వచ్చిన ఆరోపణలపై జేపీసీ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అనేక మంది విపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకున్నారు. నినాదాలు కొనసాగడంతో సభా కార్యక్రమాలను సభాపతి సోమవారానికి వాయిదా వేశారు.

రాహుల్ గాంధీకి జైలు శిక్ష గురించి తెలుసు

ఐరాస అధ్యక్షుడి డిప్యూటీ ప్రతినిధి ఫర్హాన్ హక్

న్యూదిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించడం, ఆయన పార్టీ తీర్పుపై అప్పీలు చేయాలని యోచిస్తోందంటూ వచ్చిన నివేదికల గురించి ఐక్యరాజ్యసమితికి తెలుసునని ఐరాస అధ్యక్షుడు ఆంటోనియో గుటెర్రెస్ అధికార ప్రతినిధి తెలిపారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం గురించి గుటెర్రెస్ ఆందోళన చెందుతున్నారా అనే ప్రశ్నకు ఐరాస సెక్రటరీ జనరల్ డిప్యూటీ ప్రతినిధి ఫర్హాన్ హక్ గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో స్పందించారు. 'రాహుల్ గాంధీ కేసుకు సంబంధించిన నివేదికల గురించి మాకు తెలుసునని నేను చెప్పగలను. ఆయన పార్టీ నిర్ణయంపై అప్పీల్ చేయాలని యోచిస్తున్నట్లు మాకు అర్థమైంది. ఈ దశలో నేను చెప్పగలిగినది అంతే' అని హక్ తెలిపారు.

బీజేపీ నియంతృత్వంపై సుప్రీంను ఆశ్రయించాం: ఆప్

న్యూదిల్లీ: నియంతృత్వ బీజేపీపై పోరాటానికి ప్రతిపక్ష పార్టీలన్నీ సన్నద్ధమయ్యా యని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తెలిపింది. కమలనాథుల నియంతృత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా, విమర్శించినా కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి కేసులు పెడుతున్నారని, జైళ్లకు పంపుతున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రత్యర్థులపై ప్రయోగిస్తున్న బీజేపీపై 14 విపక్ష పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించింది. కాషాయ పార్టీలో చేరిన రాజకీయ నాయకుల మురికినంతటినీ శుభ్రం చేసే వాషింగ్ మిషన్‌లా బీజేపీ మారిందని ఆప్ సీనియర్ నేత, దిల్లీ మంత్రి అతిషి ఆరోపించారు. బీజేపీ నియంతృ త్వాన్ని వ్యతిరేకించడం, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు అతిషి విలేకరులకు తెలిపారు. 'బీజేపీ వాషింగ్ మిషన్‌లా మారింది. ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఒత్తిడి తీసుకురావడానికి, బలవం తంగా తమ పార్టీలో చేర్చుకోవడానికి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. విపక్ష నేతలు ఎవరైనా ఒకసారి బీజేపీలో చేరితే...అన్ని కేసులు మూతపడతాయి. బీజేపీలో చేరిన అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ, సువేందు అధికారి వంటి నేతలు బీజేపీలో చేరారు. వారిపై కేసులన్నీ మాయమయ్యాయి' అని ఆమె గుర్తుచేశారు.

114 గ్రామాలకు శ్మశాన వాటికలు లేవు: కలెక్టర్

అలీబాగ్: భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడిచినా మహారాష్ట్రలోని రాయ్‌గడ్ జిల్లాలో 114 గ్రామాల్లో ఇప్పటికీ శ్మశాన వాటికలు లేవని స్వయానా ఓ అధికారి వెల్లడించారు. ఇది కేవలం ఒక జిల్లాకు సంబంధించిన లెక్క మాత్రమేనని, రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి అధికారంగానే ఉందని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు. మరణించిన తర్వాత ప్రశాంతంగా దహన సంస్కారాలు చేసుకోవడానికి కూడా అవకాశం లేదని ఆరోపించారు. జిల్లాలో మొత్తం 1999 గ్రామాలు ఉండగా 114 గ్రామాలలో శ్మశానవాటికలు లేవని కలెక్టర్ డా.యోగేశ్ తెలిపారు. ఆ గ్రామాలకు శ్మశాన వాటికల కోసం సరైన స్థలాన్ని కనుగొనాలని రెవెన్యూ అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లను ఆదేశించారు. 2,214 గ్రామాల్లో అధికారిక రోడ్లన్నీ ఆక్రమణకు గురయ్యాయని, వాటిని ప్రజలు ఉపయోగించే పరిస్థితి కనిపించడం లేదని కలెక్టర్ తెలిపారు. రోడ్ల ఆక్రమణలు తొలగించడానికి రెవెన్యూ, పోలీసు అధికారులు సమాయత్తమవుతున్నారు.

ఎల్గార్ పరిషత్ కేసులో జైలుకెళ్లిన

డాక్టర్ హనీ బాబుకు గౌరవ డాక్టరేట్



నాగపూర్: ఎల్గార్ పరిషత్-మావోయిస్టులతో సంబంధాల కేసులో నిందితుడు, ప్రస్తుతం నవీ ముంబైలోని జైలులో ఉన్న దిల్లీ విశ్వవిద్యాలయం మాజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హనీ బాబు బెల్జియంలోని విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా పొందనున్నారు. బెల్జియంలోని ఘెంట్ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ ఫిలాసఫీ బోధనా విభాగం నుంచి ఆయనకు శుక్రవారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు హనీ బాబు భార్య జెన్నీ రోవేనా గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎల్గార్ పరిషత్-మావోయిస్టులతో సంబంధాల కేసులో జులై 2020లో హనీ బాబు అరెస్టయ్యాడు. ఈ కేసులో అరెస్టయిన 12వ వ్యక్తి ఆయన. ఈ కేసు డిసెంబరు 31, 2017న పూణేలో జరిగిన ఎల్గార్ పరిషత్ సమావేశానికి సంబంధించినది. మరుసటి రోజు పూణే నగరానికి సమీపంలో ఉన్న భీమా కోరేగావ్ యుద్ధ స్మారకం వద్ద రెచ్చగొట్టే ప్రసంగాలు కుల హింసకు దారితీశాయని, పరిషత్‌కు మావోయిస్టులు మద్దతు ఇచ్చారని పూణే పోలీసులు ఆరోపించారు. 'డాక్టర్ హనీ బాబు పేరును కార్యనిర్వాహక కమిటీకి నామినేట్ చేసిన ఘెంట్ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ ఫిలాసఫీ ఫ్యాకల్టీ, విద్యా స్వేచ్ఛ, భాషా హక్కులు, మైనారిటీలకు సమానమైన విద్యకు సమాన ప్రాధాన్యాన్ని కాపాడేందుకు ఆయన చేసిన ప్రయత్నాలను ఎత్తిచూపుతూ తన నామినేషన్‌ను సమర్థించారు' అని ఆయన భార్య ఆ ప్రకటనలో వివరించారు. డిప్లొమా, ఎపిటోగా మార్చి 24న విశ్వవిద్యాలయం 'డైస్ నటాలిస్' లేదా వార్షికోత్సవ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు. ఘెంట్ విశ్వవిద్యాలయంలోని భాషా శాస్త్ర విభాగానికి చెందిన జర్మన్ విభాగంలో చారిత్రక భాషాశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అన్నే బ్రీట్‌బార్త్... హనీ బాబు స్థానంలో గౌరవ బ్యాడ్జిలను అందుకుంటారని, పరిస్థితులు అనుమతించిన వెంటనే అతనికి అందజేస్తారని విశ్వవిద్యాలయం ప్రతినిధిని ఉటంకిస్తూ ఆమె పేర్కొన్నారు. హనీ బాబుతో పాటు అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రియా, నెదర్లాండ్స్‌కు చెందిన మరో ఆరుగురు పరిశోధకులు, పండితులకు కూడా అదే రోజు ఘెంట్ విశ్వవిద్యాలయం గౌరవ పట్టాలను అందజేస్తోందని వివరించారు. హనీ బాబు ప్రస్తుతం నవీ ముంబైలోని తలోజా జైలులో ఉన్నాడు.

రాహుల్ పోస్టర్‌పై చెప్పుల దాడి

- దద్దరిల్లిన మహారాష్ట్ర అసెంబ్లీ
- బీజేపీ, శివసేన ఎమ్మెల్యేల సస్పెన్షన్‌కు కాంగ్రెస్ డిమాండ్

ముంబై: కాంగ్రెస్ పార్టీ నిరసనలు, ఆందోళనతో మహారాష్ట్ర అసెంబ్లీ శుక్రవారం దద్దరిల్లింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పోస్టర్‌ను చెప్పులతో కొట్టిన బీజేపీ, శివసేన ఎమ్మెల్యేలను వెంటనే సస్పెండ్ చేయాలని ఆ పార్టీ ఎమ్మెల్యేలు సభలో డిమాండ్ చేశారు. హిందుత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న సాకుతో రాహుల్ పోస్టర్‌ను మతోన్మాద ఎమ్మెల్యేలు చెప్పులతో కొట్టిన విషయం విదితమే. ఈ వ్యవహారంపై కాంగ్రెస్, బీజేపీ సభ్యుల నినాదాలు, ప్రతినినాదాలతో సభ అట్టుడికింది. దీంతో స్పీకర్ సభను మూడుసార్లు వాయిదా వేశారు. సభ సమావేశం కాగానే స్పీకర్ రాహుల్ నర్వేకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, జాతీయ నాయకుల పేర్లను సభ్యులు ప్రస్తావించడానికి కొన్ని మార్గదర్శకాలు, ప్రమాణాలు రూపొందిస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే జోక్యం చేసుకుంటూ సావర్కర్, ప్రధాని నరేంద్ర మోదీలను ప్రతిపక్షాలు తీవ్రంగా అవమానిస్తున్నాయని ఆరోపించారు. సావర్కర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో బీజేపీ, ఏక్‌నాథ్ షిండే నాయకత్వాన గల శివసేన సభ్యులు గురువారం అసెంబ్లీ ఆవరణలో రాహుల్‌గాంధీ పోస్టర్‌ను చెప్పులతో కొట్టారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీ మహారాష్ట్రలో సావర్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని బీజేపీ ఆరోపించింది.

రాహుల్ పోస్టర్‌ను చెప్పులతో కొట్టిన అధికార పార్టీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలని ఉదయం సభ సమావేశం కాగానే కాంగ్రెస్ నేత నానా పటోల్ డిమాండ్ చేశారు. దీనికి స్పీకర్ స్పందిస్తూ ఈ పరిణామాలపై నివేదిక కోరానని, వీడియో ఫుటేజ్‌లు సైతం పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఫుటేజీ పరిశీలించాక...రూలింగ్ ఇస్తానని చెప్పారు. సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకంగా తాను వ్యవహరించబోనని తెలిపారు. దీంతో ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రాహుల్‌గాంధీకి మద్దతుగా నినాదాలు చేశారు.

కాంగ్రెస్ వాకౌట్

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడానికి నిరసనగా మహారాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు. పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు రెండేళ్ల శిక్ష విధించడంతో ఆయనను ఎంపీ పదవి నుంచి తప్పించారు. ఈ విషయం అసెంబ్లీని కుదిపేసింది. లోక్‌సభ సభ్యుడిగా రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయాలన్న నిర్ణయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనికి నిరసనగా అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నామని కాంగ్రెస్ నేత నానా పటోల్ చెప్పారు. రాహుల్‌పై వేటు వేయడానికి నిరసనగా ఎన్‌సీపీ, శివసేన(ఉద్ధవ్) ఎమ్మెల్యేలు సహా ప్రతిపక్ష సభ్యులంతా విధాన సభ మెట్లపై నిరసన తెలిపారు.

గుజరాత్‌లో కాంగ్రెస్ 'మౌన' నిరసనలు

అహ్మదాబాద్: కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి 2019 నాటి పరువు నష్టం దావా వ్యవహారంలో సూరత్ కోర్టు రెండేళ్ల శిక్ష విధించడానికి నిరసనగా గుజరాత్‌లోని కాంగ్రెస్ వర్గీయులు మౌనంగా నిరసనకు దిగారు. శుక్రవారం 19 జిల్లా కేంద్రాలలో మౌనదీక్షలు నిర్వహించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఆందోళనలు చేయాలని కార్యకర్తలకు కాంగ్రెస్ సూచించినట్లు పార్టీ అధికార ప్రతినిధి హిరేన్ బంకర్ తెలిపారు. సోమవారం మరిన్ని ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సూరత్ కోర్టు జైలుశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీచేసిన మరుసటి రోజు రాహుల్ గాంధీపై లోక్‌సభలో అనర్హత వేటు పడిన విషయం విదితమే.

జైలుశిక్షతో చట్టసభల సభ్యత్వం కోల్పోయిన నేతలు

దిల్లీ: మోదీ ఇంటి పేరును కించపరిచేలా చేసిన వ్యాఖ్యలకుగానూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి జైలుశిక్ష పడిన నేపథ్యంలో ఆయన పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు పడింది. అయితే, అప్పీలుకు వెళ్లేందుకు రాహుల్‌కు 30రోజులు గడువు ఉండటంపై కోర్టు నిర్ణయానికి అనుగుణంగా మళ్లీ ఆయన అర్హత పొందే అవకాశాలు ఆధారపడి ఉంటాయి. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 8(3) ప్రకారం ఏదైనా కేసులో దోషిగా తేలి, రెండేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష పడిన చట్టసభ సభ్యులు తమ సభ్యత్వాన్ని కోల్పోతారు. ఇలా గతంలో లోక్‌సభ, శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయిన నేతలను ఓ సారి పరిశీలిస్తే..

- **మొహమ్మద్ ఫైజల్:** ఓ హత్యాయత్నం కేసులో లక్షద్వీప్ ఎంపీ మొహమ్మద్ ఫైజల్‌ను అక్కడి సెషన్స్ కోర్టు దోషిగా తేల్చింది. దీంతో ఈ ఏడాది జనవరిలో తన పార్లమెంట్ సభ్యత్వాన్ని కోల్పోయారు. అయితే, అనంతరం కేరళ హైకోర్టు స్టే విధించడంతో మళ్లీ ఆయన సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని న్యాయశాఖ సిఫార్సు చేసింది.
- **లాలూ ప్రసాద్ యాదవ్:** పశుగ్రాసం కుంభకోణం కేసులో దోషిగా తేలిన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కూడా లోక్‌సభ సభ్య త్వాన్ని కోల్పోయారు. కుంభకోణానికి సంబంధించి 2013లో వచ్చిన తీర్పుతో పార్లమెంటుకు దూరమయ్యారు. అనంతరం జైలుకు వెళ్లిన ఆయన ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు.
- **ఆజాం ఖాన్:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాంపూర్ మాజీ ఎంపీ, సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజాం ఖాన్‌ను 2019లో చేసిన ద్వేషపూరిత ప్రసంగం కేసులో న్యాయస్థానం దోషిగా తేల్చింది. రాంపూర్ కోర్టు తీర్పు వెలువరించిన అనంతరం యూపీ అసెంబ్లీ ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. అంతకుముందు ఎంపీగా ఉన్న ఆయన ఇటీవల ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

జయలలిత: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత కూడా జైలు శిక్ష కారణంగా అనర్హతకు గురయ్యారు. అక్రమాస్తుల కేసులో నాలుగేళ్ల జైలుశిక్షతోపాటు రూ.100 కోట్ల జరిమానా కూడా పడింది. దీంతో అనర్హతకు గురైన ఆమె సీఎం పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చింది. అనంతరం 2015లో కర్ణాటక హైకోర్టు కింది కోర్టు ఇచ్చిన తీర్పును పక్కనబెడుతూ నిర్దోషిగా ప్రకటించించడంతో మళ్లీ సీఎం పగ్గాలు చేపట్టారు. చివరకు ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది.

అనర్హత వేటు పడిన ఇతర నాయకులు: మహారాష్ట్ర థాణెలోని ఉల్హాస్‌నగర్ ఎమ్మెల్యే పప్పూ కలానీ 2013లో ఓ కేసులో దోషిగా తేలడంతో శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు.

- దాణా కుంభకోణం కేసులో నాలుగేళ్ల శిక్ష పడటంతో జేడీయూ నేత, బీహార్‌లోని జహానాబాద్ ఎంపీ జగ్‌దీశ్ శర్మపై అనర్హత వేటు పడింది.
- కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ రషీద్ మసూద్‌కు ఎంబీబీఎస్ సీట్ల కుంభకోణంలో నాలుగేళ్ల శిక్ష పడింది. దీంతో రాజ్యసభ సభ్యుడిగా అర్హత కోల్పోయారు.
- సూసైడ్ కేసుకు సంబంధించి మధ్యప్రదేశ్ బీజేపీ నేత, బిజావర్ ఎమ్మెల్యే ఆశా రాణి అనర్హురాలయ్యారు.
- ఝార్ఖండ్ ఎమ్మెల్యే ఎనోస్ ఎక్కాకు.. ఓ కేసులో జీవిత ఖైదు పడటంతో ఆయన కూడా తన సభ్యత్వాన్ని కోల్పోయారు.
- అక్రమాస్తుల కేసుకు సంబంధించి శివసేన ఎమ్మెల్యే బాబన్‌రావ్ ఘోలాప్‌నకు మూడేళ్ల శిక్ష పడటంతో 2014లో ఆయన చట్టసభ్యుడిగా అనర్హుడయ్యారు.
- తమిళనాడులో డీఎంకే నేత, రాజ్యసభ ఎంపీ టీఎం సెల్వగణపతికి ఒక కేసులో రెండేళ్ల శిక్ష పడటంతో పార్లమెంట్ సభ్యత్వం కోల్పోయారు.
- మహారాష్ట్రకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే సురేష్ హల్వాంకర్‌కు విద్యుత్ దోపిడీ కేసులో మూడేళ్ల శిక్ష పడింది. దీంతో 2014లో ఆయన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని కోల్పోయారు.
- ఝార్ఖండ్‌కు చెందిన లోహర్‌దగ్గా ఎమ్మెల్యే కమల్ కిశోర్ భగత్ కూడా హత్య కేసులో దోషిగా తేలడంతో 2015లో శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు.

ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలుశిక్ష పడిన వ్యక్తి తీర్పు వెలువడిన తేదీ నుంచి రాజ్యాంగ పదవుల్లో ఉండటానికి, ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేకుండా ఆరేళ్లపాటు అనర్హులుగా ప్రకటిస్తారు. జైలు శిక్షకాలంతోపాటు మరో ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు అవుతారు. ప్రజాప్రతినిధులు దోషులుగా తేలిన వెంటనే అనర్హులుగా పరిగణించాలని 2013లో సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

డీయూ విద్యార్థులపై ఖాకీ క్రౌర్యం

- వారి ఆందోళనపై ఉక్కుపాదం
- లాఠీలు కురిపించిన వైనం
- 11 మంది నిర్బంధం
- ఇద్దరి డిబార్ రద్దు వరకు వెనక్కుతగ్గం: ఏఐఎస్ఏ

న్యూదిల్లీ: దిల్లీ యూనివర్సిటీలో గుజరాత్ అల్లర్లపై బీబీసీ డాక్యుమెంటరీ స్క్రీనింగ్‌లో పాల్గొన్న కారణంగా ఇద్దరు విద్యార్థులను డిబార్ చేయడంతో యూనివర్సిటీ విద్యార్థులంతా ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో దిల్లీ పోలీసులు, డీయూ గార్డులు నిరసనకారులపై విరుచుకుపడి వారి ఆందోళనపై ఉక్కుపాదం మోపారు. లాఠీలు కురిపించారు. 11మందిని నిర్బంధించారు. వీరిలో తొమ్మిది మంది అబ్బాయిలు ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. వర్సిటీ ఉత్తర క్యాంపస్‌లో ఆందోళన చేస్తున్న తమను పోలీసులు, వర్సిటీ భద్రతా సిబ్బంది కొట్టినట్లు విద్యార్థులు ఆరోపించారు. తమ ఆందోళనకు ముందే క్యాంపస్‌లో పోలీసులు, పారా మిలటరీ దళాలను మోహరించారని తెలిపారు. 25 మంది విద్యార్థులను నిర్బంధించినట్లు అఖిలభారత విద్యార్థుల సమాఖ్య (ఏఐఎస్ఏ) దిల్లీ అధ్యక్షుడు అభిజ్ఞాన్ వెల్లడించారు. అనేకమంది విద్యార్థులను బురారీ పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. ఏఐఎస్ఏ డీయూ కార్యదర్శి అంజలి మాట్లాడుతూ 'ఇద్దరు విద్యార్థులను డీబార్ చేయడానికి నిరసనగా ఆర్ట్స్ ఫ్యాకల్టీ వద్ద ఆందోళనకు దిగిన విద్యార్థులను క్రూరంగా కొట్టారు... అక్కడ నుంచి ఈడ్చేశారు. నిర్బంధించారు. ఇది ఖాకీ క్రౌర్యానికి నిదర్శనం. కాలేజి యాజమాన్యానికి బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ అండదండలు ఉన్నాయి. మా క్యాంపస్ ప్రజాస్వామ్యం పరిరక్షణకు పోరాడతాం. ఆదేశాలు ఉపసంహరించుకునేంత వరకు అసంతృప్తిని తెలియజేస్తాం' అని అన్నారు. ఏఐఎస్ఏ కార్య కర్తలు విడుదల చేసిన ఓ వీడియోలో యూని వర్సిటీ విద్యార్థులను భద్రతా సిబ్బంది, పోలీసులు తోసేయడం, ఈడ్చుకొని వెళ్లడం కనిపిస్తోంది. అయితే క్యాంపస్‌లో శాంతికి భంగం కలిగించరాదనే వివేకానంద విగ్రహం వద్ద విద్యా ర్థుల ఆందోళనను భగ్నం చేశామని పోలీసులు అన్నారు. ఆందోళనకు అనుమతి కోరలేదని విద్యార్థుల క్రమ శిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదని యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి. ఆందోళనకారుల్లో చాలా మంది తమ యూనివర్సిటీ విద్యార్థులు కాదని డీయూ ప్రొక్టర్ రజిని అబ్బి తెలిపారు. 'ఆర్ట్స్ ఫ్యాకల్టీ లోపల ఆందోళన చేపట్టారు. వారు పోలీసులకూ సమాచారం ఇవ్వలేదు. ఇటువంటివి చేపట్టే ముందు కనీసం పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారికి మేము సూచించారు. ఇప్పుడు వారు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు వివేకానంత విగ్రహం వద్ద ఆందోళన మొదలుపెట్టారు. దీనిని సహించేది లేదు. వీళ్లలో చాలా మంది అసలు డీయూ విద్యార్థులే కాదు' అని చెప్పారు. 2002 గోద్రా అల్లర్లపై 'ది మోదీ క్వశ్చన్' అనే బీబీసీ డాక్యుమెంటరీ స్క్రీనింగ్‌లో పాల్గొన్న కాంగ్రెస్ విద్యార్థి నేతతో సహ ఇద్దరిని ఏడాది కోసం దిల్లీ యూనివర్సిటీ డిబార్ చేసింది. నిర్దేశిత కాలంలో సంబంధిత విద్యార్థులు యూనివర్సిటీకి లేక కాలేజికి హాజరు కావడం, విభాగాల పరీక్షలు రాసేందుకు అనుమతి ఉండదు. దిల్లీ యూనివర్సిటీ వినతిమేరకు 11 మంది విద్యార్థులను వివేకానంద విగ్రహం వద్ద నుంచి లేపేశామని డిప్యూటీ పోలీసు కమిషనర్ సాగర్ సింగ్ వెల్లడించారు.

విపక్షం నిరసన హోరు

- 'ప్రజాస్వామ్యం ప్రమాదం'లో ఉందంటూ నినాదాలు
- అదానీపై జేపీసీ దర్యాప్తునకు డిమాండ్
- కాంగ్రెస్ సహా 40 మంది ఎంపీల నిర్బంధం

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యం 'ప్రమాదం' లో ఉందని, అదానీ సమస్యపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణకు డిమాండ్ చేస్తూ పార్లమెంటు హౌస్ నుంచి ప్రతిపక్ష పార్టీలు నిరసన ప్రదర్శన చేపట్టాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్‌తో సహా 40 మందికి పైగా ప్రతిపక్ష ఎంపీలను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించినందుకు కేసీ వేణుగోపాల్, అధిర్ చౌదరి, కె.సురేష్, మాణిక్యం ఠాగూర్, ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, మహ్మద్ జావేద్‌తో సహా ప్రముఖ నాయకులను పోలీసులు అడ్డుకుని విజయ్ చౌక్‌లో అదుపులోకి తీసుకున్నారని ప్రతిపక్షం పేర్కొంది. 'సెక్షన్ 144 (నిషేధ ఉత్తర్వులు) ఉల్లంఘించినందుకు ప్రతిపక్ష పార్టీలకు చెందిన 40 మందికి పైగా ఎంపీలను అదుపులోకి తీసుకోవలసి వచ్చింది' అని దిల్లీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు దిల్లీ పోలీసులు చెప్పారు. అంతకుముందు విజయ్ చౌక్‌లో మీడియాతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే సహా అనేక మంది నాయకులు సూరత్ కోర్టు 2019 క్రిమినల్ పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీని దోషిగా నిర్ధారించిన అంశాన్ని లేవనెత్తారు. ప్రతిపక్షాల గొంతులను అణిచివేసేందుకు ప్రభుత్వం కేసులతో వారిని లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ లోపల నిరసన తర్వాత, సీపీఐ, సీపీఎం, శివసేన (ఉద్ధవ్ థాకరే), జేడీ(యూ), ఆమ్ ఆద్మీ పార్టీ వంటి పార్టీలకు చెందిన అనేక మంది ప్రతిపక్ష నేతలు... 'డెమొక్రసీ ఇన్ డేంజర్' అని రాసిన భారీ బ్యానర్‌తో 'మేము జేపీసీని డిమాండ్ చేస్తున్నాము', 'సేవ్ ఎల్ఐసీ' ప్లకార్డులు పట్టుకుని విజయ్ చౌక్‌కు చేరుకున్నారు. 'మేము అదానీ సమస్యపై జేపీసీ కోసం నెలల తరబడి పోరాడుతున్నాము. వారికి మెజారిటీ ఉంది. కానీ ఏదో చేపలు పట్టడంతో బీజేపీ భయ పడుతోంది. దాని కోసం ఐక్యంగా పోరాడుతూనే ఉంటాం' అని ఖడ్గే అన్నారు. రాహుల్ గాంధీ ఓబీసీ వర్గాలను దొంగలతో పోల్చారంటూ బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన ఆరోపణలపై ఆయన మండి పడ్డారు. బీజేపీ 'కుల రాజకీయాలు'కు పాల్పడుతోందని అన్నారు. ఆప్‌కి చెందిన సంజయ్ సింగ్ మాట్లాడుతూ ప్రతిపక్షాలపై కేసులు బనాయించి వారిని తుదముట్టించాలని ప్రభుత్వం కోరు కుంటోందని, అందుకే రాహుల్ గాంధీని దోషిగా తేల్చిందని ఆరోపించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పార్లమెంట్ హౌస్, విజయ్ చౌక్ పరిసరాల్లో భద్రతను పెంచినట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ఎవరికీ తలవంచం

దేనికైనా సిద్ధం: రాహుల్, ప్రియాంక

న్యూఢిల్లీ: 'దేశ ప్రజల వాణిని వినిపించేందుకే నా పోరాటం.. వెనక్కుతగ్గేదే లేదు. ఎలాంటి త్యాగానికైనా సిద్ధమే' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వక్కాణించారు. లోక్‌సభలో తనపై అనర్హత వేటు అనంతరం రాహుల్ పై విధంగా స్పందించారు. మేము ఎవరికీ బెదరం... తలవంచం అని రాహుల్ గాంధీతో పాటు ఆయన సోదరి పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నొక్కిచెప్పారు. మా రక్తంలోనే తలవంచడం లేదన్నారు. ఏం చేస్తారో చేసుకోండంటూ మోదీకి సవాల్ విసిరారు. 'అమర ప్రధాని తనయుడిపై 'మీర్ జాఫర్' వ్యాఖ్యలు చేశారు. ఆయన కుటుంబాన్ని అవమానించారు. తమ రక్తాన్ని ధారపోసి ప్రజాస్వామ్యాన్ని కాపాడిన కుటుంబానికి చెందిన రాహుల్ ఎవరికీ తలవంచరు' అని ప్రియాంక గాంధీ అన్నారు. తన సోదరుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటు క్రమంలో ఆమె వరుస ట్వీట్లలో మోదీపై బీజేపీ నేతలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నరేంద్రమోదీజీ... మీ భక్తులు అమర ప్రధాని తనయుడిని ద్రోహి మీర్ జాఫర్‌తో పోల్చారు. మీ ముఖ్యమంత్రుల్లో ఒకరు రాహుల్ గాంధీ తండ్రి ఎవరని ప్రశ్నించారు. కశ్మీరీ పండిట్ల సంప్రదాయం ప్రకారం కుటుంబ పెద్దగా ఉన్న తండ్రి మరణిస్తే కుటుంబ బాధ్యతలను స్వీకరిస్తూ తలపాగాను కుమారుడు ధరిస్తాడు. మొత్తం కుటుంబాన్ని, కశ్మీరీ పండిట్ వర్గాన్ని అవమానిస్తూ పార్లమెంటులో నెహ్రూ ఇంటి పేరు ఎందుకు పెట్టుకోలేదని మీరు అడుగుతారు. కానీ ఏ జడ్జి మీకు రెండేళ్ల జైలు శిక్ష విధించలేదు. మీపై పార్లమెంటులో అనర్హత వేటు పడలేదు' అని ప్రియాంక మండిపడ్డారు. రాహుల్ గాంధీ నిజమైన దేశభక్తుడని, అదానీ గ్రూపు లూటీపై ప్రశ్నించారని, నీరవ్ మోదీ, మేహుల్ చోక్సీ వంటి వారి గురించి ప్రశ్నలు లేవనెత్తారని పేర్కొన్నారు. 'మీ మిత్రుడు గౌతం అదానీ దేశ పార్లమెంటు కంటే దేశ ప్రజల కంటే గొప్పవాడయ్యాడా.. అతను దోచుకున్న దాని గురించి అడిగితే మీకెందుకంత ఉలుకు? నా కుటుంబ వారసత్వాన్ని విమర్శిస్తారు. ఈ కుటుంబంలోని వారు తమ రక్తాన్ని ధారపోసి ప్రజాస్వామ్యాన్ని పోషించిన విషయాన్ని గమనంలో ఉంచుకోండి. తరతరాలుగా నిజం కోసం పాటుపడుతూ భారత ప్రజల గళాన్ని వినిపించిన కుటుంబం ఇది. మాలోనూ అదే రక్తం ప్రవహిస్తోంది. దానిని తలవంచడం తెలియదు. మీలాంటి అధికార దాహార్తిగల పిరికి నియంత ముందర తలొగ్గేదేలేదు. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని మోదీపై ప్రియాంక విరుచుకుపడ్డారు.

ఐక్య అజెండాతో ముందుకు...

న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటును విపక్షాలు తీవ్రంగా పరిగణించాయి. దీనిపై ఐక్యపోరాటానికి నడుం బిగించాయి. ఇదే విషయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అధ్వర్యంలో శుక్రవారం విపక్ష పార్టీల నేతలు భేటీ అయి భవిష్యత్ కార్యాచరణను చర్చించారు. పార్లమెంటు కాంప్లెక్స్‌లోని రాజ్యసభలో ప్రతిపక్ష నేత చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం, డీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్, ఆర్ఎస్పీ, వీసీకే, జేడీయూ, ఎస్పీ, ఎస్ఎస్, ఐయూఎంఎల్, ఆప్ నేతలు పాల్గొన్నారు. ధర్నా చేయాలని, రాష్ట్రపతి ముర్మును కలవాలని ప్రతిపక్ష నేతలు నిర్ణయించినట్లు తెలిసింది.

సీపీఎస్ ఉద్యోగుల ఖాతాల్లో

రూ.3 వేల కోట్ల బకాయిలు జమ చేయాలి

శాసన మండలిలో కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మార్చి 2022 నుంచి ఫిబ్రవరి 23 వరకు రూ.3 వేల కోట్లు సీపీఎస్ ఉద్యోగుల ఖాతాల్లో జమ కాలేదని, వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం శాసన మండలిలోని వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా జమ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉర్దూ ఖాళీ టీచర్లు భర్తీ చేయండి

ఉన్నతీకరణ చెందిన ఉర్దూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రశ్నోత్తరాల సమయంలో కత్తి నరసింహారెడ్డి కోరారు. ఖాళీలు లేకుండా వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయగా... సంబంధిత పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి (మైనార్టీ సంక్షేమం) అంజాద్ బాషా హామీ ఇచ్చారు.

అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులను వెంటనే పునర్నిర్మించండి

వరదల వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య జిల్లాలోని అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులను వెంటనే పునర్నిర్మించి, వినియోగంలోకి తీసుకుని రావాలని కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. అదే మండలంలోని జరికోన ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా చెరువులకు నీళ్లు ఇచ్చే ప్రతిపాదనలనూ ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేయగా... దానిపై జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమాధానమిస్తూ ఆయా ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్రామ సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

గ్రామ/వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి పదోన్నతులు కల్పించి ప్రభుత్వ ఉద్యోగుల సౌలభ్యాలన్నీ వర్తింపు ఉత్తర్వులు విడుదల చేయాలని కత్తి నరసింహారెడ్డి కోరగా... సంబంధిత పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సానుకూలంగా స్పందించారు.

వాయనాడ్ స్థానం ఖాళీ

లోక్‌సభ అధికారిక ప్రకటన

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటుతో ఆయన ప్రాతినిధ్యం వహించే వాయనాడ్ స్థానం ఖాళీ అయినట్లు లోక్‌సభ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. జలంధర్, లక్షద్వీప్‌తో పాటు వాయనాడ్ స్థానం ఖాళీగా ఉన్నట్లు వెబ్‌సైట్ పేర్కొంది. కాంగ్రెస్ సభ్యుడు సంతోఖ్ సింగ్ చౌదరి మరణంతో జలంధర్ స్థానం ఖాళీ కాగా ఎన్‌సీపీ సభ్యుడు మహమ్మద్ ఫైజల్ పీపీపై అనర్హత వేటుతో లక్షద్వీప్ స్థానం ఖాళీ అయింది. హత్య కేసులో ఆయనకు పదేళ్ల జైలుశిక్ష పడింది. తాజాగా 2019 నాటి పరువు నష్టం కేసులో రాహుల్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధించారు. దీంతో ఆయనపై అనర్హత వేటు పడింది. ఈ నేపథ్యంలో వాయనాడ్ స్థానం ఖాళీ అయినట్లు లోక్‌సభ వెబ్‌సైట్ వెల్లడించింది. రాహుల్ 2004-09 వరకు అమేథి నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించగా 2019 ఎన్నికల్లో ఆ స్థానాన్ని బీజేపీ నేత స్మృతి ఇరానీ గెలుచుకున్నారు. అదే ఎన్నికల్లో తాను పోటీ చేసిన రెండవ స్థానం వాయనాడ్ నుంచి రాహుల్ గెలుపొందారు.

జీవో 1 రద్దుపై ఆందోళనతో

చివరిరోజూ టీడీపీ సభ్యుల సస్పెన్షన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శాసనసభ బడ్జెట్ సమావేశాలు చివరి రోజు శుక్రవారం కూడా టీడీపీ సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ప్రశ్నోత్తరాలను ప్రారంభించగానే జీవో 1పై చర్చ కోరుతూ టీడీపీ సభ్యులు వాయిదా తీర్మానం ఇచ్చారు. దీనిని స్పీకర్ తిరస్కరించడంతో ఆందోళనకు దిగారు. జీవో 1 రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. వీరు ఆందోళన చేస్తుండగానే స్పీకర్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. సభను ముందుకు సాగనివ్వకుండా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకు వస్తూ తమ ఆందోళనను ఉధృతం చేశారు. అదే సమయంలో స్పీకర్ తమ్మినేని సీతారాం వారిని వారిస్తూ వెల్‌లో గీసిన ఎర్ర గీతను దాటి వస్తే మాత్రం ఆటోమేటిక్ సస్పెన్షన్‌ను అమలు చేస్తానని వారిని హెచ్చరించారు. దీంతో వారంతా ఆ గీత దాటకుండానే నినాదాలు చేస్తూ నిలిచిపోయారు. లక్ష్మణ రేఖ తరహాలో ఆ ఎర్ర గీతకు ప్రతిపక్ష సభ్యులు ఎంతో ప్రాధాన్యతనిస్తూ దానికి వెలుపల నుంచే ఆందోళన చేపట్టారు. స్పీకర్ వారి ఆందోళనను పట్టించుకోకుండా ప్రశ్నోత్తరాలను కొనసాగించారు. దీంతో సభ్యులు ఎర్రగీతను దాటి స్పీకర్ పోడియంను చుట్టుముట్టేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో స్పీకర్ వారిని గీత దాటొద్దంటూ ఎన్ని సార్లు వారిస్తున్నప్పటికీ ప్రతిపక్ష సభ్యులు పోడియం పైకి దూసుకెళ్లారు. దీంతో స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారందరినీ సమావేశం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. వెలగపూడి రామకృష్ణబాబు, నిమ్మకాయల చినరాజప్ప, కింజరపు అచ్చెన్నాయుడు, మంతెన రామరాజు, గద్దే రామ్మోహన్, ఏలూరి సాంబశివరావు, డోల శ్రీబాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, బెందాళం అశోక్‌ను సస్పెండ్ చేశారు. తదుపరి మార్షల్స్ వచ్చి వారందరినీ బయటకు పంపించేందుకు ప్రయత్నించడంతో వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభ బయటకు వెళ్లిపోయారు.

తొలిపాట రాసిన చోటుకు ఆస్కార్

హైదరాబాద్: సుమారు 28 ఏళ్ల క్రితం తాను ఎక్కడైతే (రామానాయుడు స్టూడియోస్) తొలి పాటను రాశారో అక్కడికి 'ఆస్కార్' ను తీసుకెళ్లి ఆనందం వ్యక్తం చేశారు సినీ గేయ రచయిత చంద్రబోస్. 'ఆర్‌ఆర్‌ఆర్' కోసం ఆయన రాసిన 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కిన సంగతి తెలిసిందే. లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఆ వేడుకకు హాజరైన ఆయన శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. రచయితగా తనను తెలుగు చలన చిత్ర పరిశ్రమకు పరిచయం చేసిన ప్రముఖ నిర్మాత దివంగత దగ్గుబాటి రామానాయుడిని గుర్తుచేసుకుంటూ ఆయన రామానాయుడు స్టూడియోస్‌కు వెళ్లారు. అక్కడ రామానాయుడు తనయుడు, నిర్మాత సురేశ్‌బాబుని కలిసి నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. రామానాయుడు స్టూడియోస్‌లో మొదలైన నా ప్రయాణం ఆస్కార్ వరకూ వెళ్లిందంటూ సంతోషాన్ని పంచుకున్నారు. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ తనకెంతో ప్రత్యేకమని తెలిపారు. రామానాయుడు ఆశీస్సులు తనపై ఉంటాయని అభిప్రాయపడ్డారు. 1995లో వచ్చిన 'తాజ్‌మహల్'తో చిత్ర పరిశ్రమలో అడుగు పెట్టారు చంద్రబోస్. అందులో ఆయన రాసిన 'మంచు కొండల్లోన చంద్రమా' గీతం సంగీత ప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఆ పాట ప్రయాణం గురించి చెబుతూ చంద్రబోస్ 28 ఏళ్లు వెనక్కి వెళ్లారు. శ్రీకాంత్, సంఘవి, మోనికా బేడీ ప్రధాన పాత్రల్లో ముప్పలనేని శివ దర్శకత్వం వహించిన ఆ చిత్రానికి ఎం.ఎం.శ్రీలేఖ సంగీతం అందించారు. చంద్రబోస్ ఇన్నేళ్లలో ఎన్నో పాటలతో ఉర్రూతలూగించారు, కొన్నింటితో స్ఫూర్తినింపారు. ఎన్నో పద ప్రయోగాలు సృష్టించి, మెప్పించారు. ఇప్పుడు.. ఆస్కార్ పొందిన తొలి తెలుగు గేయ రచయితగా నిలిచారు.

నితిన్, రష్మిక సినిమా ప్రారంభం

హైదరాబాద్: యంగ్ హీరో నితిన్, నేషనల్ క్రష్ రష్మికల కొత్త చిత్రం ప్రారంభమైంది. వెంకీ కుడుముల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఈ ప్రాజెక్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. శుక్రవారం గ్రాండ్‌గా పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం లాంచ్ అయింది. దీనికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముహూర్తం షాట్‌ను ఆయన క్లాప్ కొట్టి ప్రారంభించారు. అలాగే దర్శకులు బాబీ, గోపీచంద్ మలినేని, హను రాఘవపూడి, బుచ్చిబాబు కూడా ఇందులో పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. వీళ్ల ముగ్గురి కాంబోలో వస్తోన్న రెండో చిత్రం కావడం.. చిరంజీవి ప్రారంభించడంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో ఆసక్తి ఏర్పడింది. అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ స్వరాలు అందిస్తున్నారు. ఇక గతంలో వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్, రష్మికలు 'భీష్మ' సినిమాలో నటించిన విషయం తెలిసిందే. ఆ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచి మంచి కలెక్షన్లు రాబట్టింది.

సినిమాల్లో వచ్చేందుకు భయపడ్డా: దుల్కర్

హైదరాబాద్: 'మహానటి', 'సీతా రామం' సినిమాలతో తెలుగు వారికి బాగా చేరువయ్యారు దుల్కర్ సల్మాన్. మమ్ముట్టి కుమారుడిగా సినీరంగంలోకి అడుగుపెట్టి కొన్నిరోజులకే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. చాలామంది స్టార్ హీరోల కుమారులు 20 ఏళ్లకే పరిశ్రమలో అడుగు పెట్టినా.. దుల్కర్ మాత్రం 28 ఏళ్లకు చలనచిత్ర రంగ ప్రవేశం చేశారు. తాను ఎందుకు ఆలస్యంగా రావాల్సి వచ్చిందో తాజాగా ఓ మీడియా సమావేశంలో తెలిపారు. "నేను ఈ రంగంలోకి రావడానికి మొదట చాలా భయపడ్డాను. అందుకే 28 ఏళ్లు వచ్చే వరకు ఆగాను. సినిమాల్లోకి వచ్చిన కొత్తలోనూ నేను నటించగలనా.. థియేటర్లో ప్రేక్షకులు నన్ను రెండు గంటలు చూడగలరా అని అనుకున్నా. ఆ వయసులో మనపై మనకు పెద్దగా నమ్మకం ఉండదు. ఎంతో అభద్రతా భావానికి లోనవుతుంటాం. నా పరిస్థితి కూడా అదే. పైగా అప్పుడు మలయాళ చిత్రపరిశ్రమలో నెపోటిజం బాగా చర్చనీయాంశమైన విషయం. మా నాన్న ఈ రంగంలో లెజెండ్. ఆయనకు ఎంతో మంది అభిమానులు ఉన్నారు. ఆయన పేరును నేను చెడగొడతానేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు సినిమానే నా జీవితమైపోయింది. నాపై సినీ రంగ అంతగా ప్రభావం చూపింది. అది నా ప్రపంచంగా మారిపోయింది" అని దుల్కర్ తెలిపారు.

ఇది ప్రజాస్వామ్యమేనా?

- మోదీ ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాల ఆగ్రహం
- రాహుల్‌పై అనర్హత వేటు... రాజకీయ కక్షసాధింపుగా విమర్శ
- విపక్షాల ఐక్యతకు ఇదే సమయమని పునరుద్ఘాటన

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటును ప్రతిపక్ష పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించారు. అధికార పక్షం అహం కారంతో, నిరంకుశత్వంగా వ్యవహరిస్తోందని, దీనిని తిప్పికొట్టాలన్నారు. రాహుల్‌పై తాజా చర్యలు బీజేపీ రాజకీయ కక్షసాధింపుకు అద్దం పడుతున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఉందా? మనం ఉన్నది ప్రజా స్వామ్యంలోనేనా? అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులను తాజా పరిణామాలు సూచిస్తున్నాయి అంటూ మోదీ ప్రభుత్వ చర్యలను విమర్శించారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతోందని దుయ్య బట్టారు. విపక్ష నేతలే బీజేపీకి ప్రధాన లక్ష్యమని విమర్శించారు. 'ప్రధాని నవభారతంలో ప్రతిపక్షాలే బీజేపీకి ప్రధాన లక్ష్యం, ఎన్నడూ లేని విధంగా మన రాజ్యాంగ ప్రజా స్వామ్యం మంటగలిసింద'ని ఆవేదన వ్యక్తంచేశారు. రాహుల్‌పై కక్షసాధింపు సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం స్పందిస్తూ 'మన ప్రజాస్వామ్యం ఎటు వెళుతోంది? కోలార్‌లో మాట్లాడిన మాటలపై సూరత్‌లో కేసు.. అదీ ఇన్నేళ్ల తర్వాతా? వారు నిర్ణయించుకునే ఏదేని కారణంపై గిట్టని ఎవరినైనా కేసుల్లో ఇరికించేయొచ్చా! ఈరోజు రాహుల్ గాంధీ రేపు మీరు.. నేను కావచ్చు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఏకమయ్యేందుకు ఇదే సమయం' అని అన్నారు. రాహుల్ గాంధీపై హడావిడిగా చర్యలు తీసుకోవడాన్ని సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య నొక్కిచెప్పారు. "మోదీ' పరువునష్టం వ్యవహారంలో గురువారం రాహుల్ గాంధీకి శిక్షపడింది. ఒక రోజు గడవకముందే అనర్హత వేటుపడింది. ఇది ప్రజాస్వామ్యంపై మెరుపుదాడి కాదా! అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా విపక్షాలు ఐక్యంగా కదంతొక్కేందుకు సమయం ఆసన్నమైంది' అని భట్టాచార్య అన్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పందిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుచరిస్తున్న విధానం ఆక్షేపణీయమని అన్నారు. ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసేందుకు నేరపూరిత పరువు నష్టం మార్గాన్ని అనుసరిస్తోంది. ఇదే రాహుల్ గాంధీ విషయంలో జరిగింది. విపక్షాలపై కక్షసాధింపు కోసం ఈడీ/సీబీఐని పూర్తి స్థాయిలో దుర్వినియోగిస్తోంది. ఇటువంటి నియంతృత్వ పోకడలను తిప్పికొట్టాలి... నియంతలను ఓడించాలి' అని ఏచూరి పిలుపునిచ్చారు. రాహుల్‌పై అనర్హత వేటు పడటాన్ని ప్రజాస్వామ్యంపై తీవ్రమైన దాడిగా సీపీఎం నేత, కేరళ సీఎం పినరయి విజయన్ పేర్కొన్నారు. బలవంతంగా అసమ్మతి గళాన్ని అణచివేయడం ఫాసిస్టు విధానమన్నారు. బీఎస్పీ ఎంపీ దానిష్ స్పందిస్తూ ఇటువంటి పరువు నష్టం వ్యవహారాల్లో ఎంపీలు తమ పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోవాల్సి వస్తే ప్రస్తుత పార్లమెంటు సభ్యుల్లో 70శాతం మంది వెళ్లిపోవాల్సిందే.. అందులోనూ అత్యధికులు బీజేపీ వారే' అని అన్నారు. దిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ట్విట్టర్ మాధ్యమంగా కేంద్రప్రభుత్వ నియంత పోకడలను దుయ్యబట్టారు. 'దేశం అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. దేశాన్ని భయపెడుతున్నారు. 130 కోట్ల మంది ఏకమైతేనే వారి అహంకారాన్ని అణచగలం. రాహుల్ విషయంలో జరిగింది షాక్‌కు గురిచేసింద'ని ట్వీట్ చేశారు. చరిత్రలోనే పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ఇంత పెద్ద దాడి జరిగిన దాఖలు లేవని రాహుల్‌పై అనర్హత వేటునుద్దేశించి ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా అన్నారు. బీజేపీ మదిలోగానీ మాటల్లోగానీ చేతుల్లోగానీ ప్రజాస్వామ్యంపై గౌరవం లేదన్నారు. నియంతృత్వాన్ని ఓడించాలంటే ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాల్సిందేనని ఆయనన్నారు.

దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం

కాంగ్రెస్ నిర్ణయం - రాహుల్‌పై అనర్హత వేటుకు నిరసన

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా పరిణమించింది. ఈ ఏడాది జరగబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024 ఎన్నికలపై దృష్టిని కేంద్రీకరించిన వేళ చోటుచేసుకున్న తాజా పరిణామంతో కాంగ్రెస్ పార్టీ ఉలిక్కిపడింది. తదుపరి ఏ విధంగా ముందుకెళ్లాలన్న దానిపై శుక్రవారం అత్య వసరంగా సమావేశమైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే, మాజీ అధినేత్రి సోనియాగాంధీతో పాటు పార్టీలోని ముఖ్యనేతలు తొలుత రాహుల్ గాంధీని కలిశారు. పార్టీ వ్యూహంపై చర్చించారు. ఆపై పార్టీ కేంద్ర కార్యాలయంలో భేటీ అయి నిశితంగా చర్చలు జరిపారు. రాహుల్‌పై అనర్హత వేటుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యూహాత్మక భేటీలో ముఖ్య నేతలు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ సీనియర్ జైరాం రమేశ్ తెలిపారు. 'రాహుల్ గాంధీపై అనర్హత వేటు మీద రాజకీయ వ్యూహాన్ని చర్చించాం. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించాం. ఇందుకోసం ప్రణాళికలు రూపొందిస్తాం' అని రమేశ్ వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, రాజీవ్ శుక్లా, తారిక్ అన్వర్, పి.చిదంబరం, ఆనంద్ శర్మ, అంబికా సోని, ముకుల్ వాస్నిక్, సల్మాన్ ఖుర్షీద్, పవన్ కుమార్ బన్సల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

రికార్డుస్థాయిలో 27 బిల్లులు ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. ఈనెల 14వ తేదీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉభయసభల నుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. మొత్తం 9 రోజులపాటు సమావేశాలు జరిగాయి. అయితే తొలిరోజు గవర్నర్ ప్రసంగం దగ్గర నుంచే టీడీపీ సభ్యులు ప్రతిరోజూ సస్పెండ్ అవుతూ వచ్చారు. తొలిరోజు వారంతట వారే వాకౌట్ చేయగా, మిగిలిన 8 రోజులు సస్పెన్షన్‌కు గురయ్యారు. శాసనసభ ఉపనాయకుడు రామానాయుడు, పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్‌లు మాత్రం సెషన్ మొత్తానికి సస్పెండ్ అయ్యారు. ఇక ఈ 8 రోజుల బడ్జెట్ సమావేశాలు టీడీపీ సభ్యుల సస్పెన్షన్‌తో ఏకపక్షంగా సాగాయి. ఎటువంటి చర్చల్లేకుండానే రికార్డుస్థాయిలో మొత్తం 27 బిల్లులు ఆమోదం పొందాయి. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు చట్టబద్ధత కల్పిస్తూ రూపొందించిన ఏపీ గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల బిల్లుతోపాటు, ఎస్సీ సబ్ ప్లాన్, ట్రైబల్ సబ్ ప్లాన్ (సవరణ) బిల్లు, ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ ఎస్టీ (సవరణ) బిల్లు, ఏపీ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ (సవరణ) బిల్లు, ఏపీ మున్సిపల్ లాస్ (సవరణ) బిల్లు, ఏపీ మున్సిపల్ లాస్ (రెండో సవరణ) బిల్లు, ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ (సవరణ) బిల్లు తదితర బిల్లులు ఆమోదం పొందాయి.

కులవివక్ష నిషేధానికి కాలిఫోర్నియా సెనేట్ ఆమోదం

కాలిఫోర్నియా: కుల వివక్ష నిషేధంపై బిల్లును కాలిఫోర్నియా సెనేట్ ఆమోదించింది. దీనిని డెమొక్రటిక్ సభ్యులు ప్రవేశపెట్టారు. దీంతో కుల వివక్షకు స్వస్తి పలికే చట్టాన్ని తెచ్చిన మొదటి దేశంగా అమెరికా నిలిచింది. సెనేటర్ ఆయిషా వాహబ్ ఈ బిల్లును సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు కార్మికులు, మహిళల హక్కులకు సంబంధించినదని బిల్లును ప్రవేశపెట్టే సమయంలో ఆమె చెప్పారు. సీటెల్‌లోనూ నెలకిందట ఇదే పరిణామం చోటుచేసుకుంది. కుల వివక్షను నిషేధించిన అమెరికాలోని మొదటి నగరంగా సీటెల్ నిలిచింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.